RNI NO. TELTEL/2022/83470 ●manasakshi.in

# మనసాక్షి

మీకోసం

తెలుగు దినపత్రిక

ఎడిటర్: మల్లె నాగిరెడ్డి

నల్గొండ | హైదరాబాద్ | సంపుటి : 4. సంచిక :261 | గురువారం 04 జూన్ 2026 | పేజీలు 8 | వెల: రూ.1.00 | epaper.manasakshi.in



- 2లో

నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు



- 2లో

మద్యం ఆదాయంపై ప్రత్యేక దృష్టి



- 2లో

## అత్యధిక కాలం ప్రధానిగా మోడీ

నెహ్రూ రికార్డుకు మోడీ బ్రేక్



## ప్రపంచ స్థాయి మెడికల్ టూరిజం

# కేంద్రంగా హైదరాబాద్

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2026'లో పాల్గొనండి

దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలేతో సిఎం రేవంత్ భేటీ

- 2లో

. తెలంగాణ, ముఖ్యంగా హైదరాబాద్ ప్రత్యేకతలను దక్షిణాఫ్రికా ప్రతినిధులకు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. అత్యాధునిక రంగాలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను తయారు చేసి ప్రపంచానికి అందించే కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి చెందిందని సీఎం తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని దక్షిణాఫ్రికా బృందాన్ని కోరారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి మెడికల్ టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ఈ రంగంలో దక్షిణాఫ్రికా కలిసి పనిచేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం



- 2లో

## తెలంగాణ అప్పులపై

# చర్చకు సిద్ధమే

వచ్చే ఏడాది ఖచ్చితంగా పాదయాత్ర చేస్తా

కడుపులో కత్తులు పెట్టుకుని నవ్వుతూ మాట్లాడలేను

మీట్ ద ప్రెస్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

## తెలంగాణలో భూముల విలువల్లో సవరణ

జూన్ 5నుంచి అమల్లోకి రానున్న ఆదేశాలు

మార్కెట్ రేట్ల మేరకు సవరణలు చేశామన్న పొంగులేటి



- 2లో




## ఆంధ్రావాళ్లదే అసలైన ప్రాంతీయ వాదం

మీరు బలవంతంగా కలుపుకుంటే విడిపోవాలనుకున్నాం

పవన్ వ్యాఖ్యలపై మాజీమంత్రి సింగిరెడ్డి విమర్శలు

హైదరాబాద్: ఆంధ్రరాష్ట్ర పునాదులపై ఏర్పడిందే అసలైన ప్రాంతీయ వాదం అని, ప్రాంతీయవాదం ఉగ్రవాదం అయితే మీరే ఉగ్రవాదులు అవుతారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఎద్దేవా చేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెలంగాణ వాదంపై అక్కసు వెళ్లగిక్కిన నేపథ్యంలో నిరంజన్ రెడ్డి స్పందించారు. తెలంగాణ పౌర సమాజాన్ని కించపరిచేలా మాట్లాడిన పవన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాచరికపు పాలన పోయి తెలంగాణ దేశంలో విలీనం కావాలని పోరాటం చేసిన జాతీయ వాదులు మా తెలంగాణ ప్రజలు అని గుర్తు చేశారు. మమ్మల్ని బలవంతంగా ఆంధ్రా ప్రాంతంతో విలీనం చేసిని విషయాన్ని గుర్తు చేశారు. నాడు మీ దుర్మార్గాల నుంచి విడిపోవాలని పోరాడారు తప్ప తెలంగాణ ప్రజలు ప్రాంతీయవాదులు కాదని స్పష్టం చేశారు. పక్కా రాష్ట్రాల వాళ్లు వచ్చి మనల్ని వెక్కిరిస్తుంటే మౌనంగా చూస్తున్న రేవంత్ రెడ్డి పెద్ద ద్రోహి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడిన విధంగా మిగతా మంత్రులు ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. నీ నోళ్లకు పక్షవాతం వచ్చిందా అని ప్రశ్నించారు. అధికార పక్షం, ప్రతి పక్షం విషయంలో ఎన్నో విభేదాలు ఉండొచ్చు. కానీ, తెలంగాణకు అవమానం జరుగుతుంటే అందరు ఏకతాటి పైకి వచ్చి మాట్లాడకపోవడం దారుణమన్నారు.



- 2లో

## ఆరోగ్యం ఉంటేనే సంపద

సంపూర్ణ ఆరోగ్యం ఉన్నవారే నిజమైన ధనవంతులు

యోగా, ధ్యానం చేస్తే అనారోగ్యం దరిచేరదు

21న కృష్ణా తీరంలో యోగా ప్రదర్శనలు

సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి





- 2లో

## ఢిల్లీ హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం



- 2లో

## తెలంగాలో పోటీచేసేది అక్కడి భూమి పుత్రులే

హైదరాబాద్‌లో మా ఇంటికి కూడా వెళ్లకూడదా

పవన్ కళ్యాణ్ మరోమారు స్పష్టీకరణ

## కర్నాటక సిఎంగా డికె శివకుమార్ ప్రమాణం

- ఉపముఖ్యమంత్రిగా జి. పరమేశ్వర్ ప్రమాణం
- మొత్తం 13 మంది మంత్రుల ప్రమాణం
- సిద్ధరామయ్య, ఖర్గేల తనయులకు కేబినేట్‌లో చోటు
- కార్యక్రమానికి హాజరైన రాహుల్, ఖర్గే, వేణుగోపాల్ , రేవంత్ రెడ్డి



బెంగళూరు: కర్ణాటక ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేశారు. లోక్‌భవన్‌లో బుధవారం సాయంత్రం 4.05 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. డీకే శివకుమార్‌తో గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. ఆయనతో పాటు మరో 13 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. సిద్ధరామయ్య ప్రభుత్వంలో హోం మంత్రిగా ఉన్న జి.పరమేశ్వర కర్ణాటక ఉపముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు.

రాజ్యాంగం మినీబుక్‌ను చేతబట్టి డీకే ప్రమాణస్వీకారం చేశారు. అంతకుముందు వేదికపై నుంచి ప్రజలకు సాష్టాంగ నమస్కారం చేశారు. తన సీనియర్ అయిన సిద్ధరామయ్యను వేదికపైనే డీకే సత్కరించారు.

జి. పరమేశ్వర ఉపముఖ్యమంత్రిగా, మరో 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. మాజీ సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనయుడు ప్రియాంక్ ఖర్గేకు మంత్రివర్గంలో చోటుదక్కింది. డీకే శివకుమార్ క్యాబినెట్ మంత్రులు 13 మంది చేత గవర్నర్ గెహ్లాట్ తావర్‌చందర్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. వీరిలో కేజీ జార్జ్, జి.పరమేశ్వర, రామలింగా రెడ్డి, కృష్ణ బైరే గౌడ, యూటీ ఖాదెర్, ఎంబీ పాటిల్, సతీశ్ జార్కిహోళి, ప్రియాంక ఘర్గే, యతీంద్ర సిద్ధరామ్యయ, లక్ష్మీ హెబ్బాల్కర్ ఉన్నారు.

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు వీడీ సతీశన్, ఎ.రేవంత్ రెడ్డి, సుఖ్వీందర్ సింగ్ సుఖు, డీకే శివకుమార్ భార్య ఉషా శివకుమార్, కుమార్తె, పలువురు ఆధ్యాత్మిక నేతలు,

విద్యార్థి, పౌరకార్మిక, రైతు ప్రతినిధులు, దళిత నేతలు, కన్నడ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అత్యధిక కాలం ప్రధానిగా మోడీ

**నెహ్రూ రికార్డుకు మోడీ బ్రేక్**

న్యూఢిలీ: నరేంద్ర మోదీ దేశ ప్రధానిగా సరికొత్త రికార్డు సృష్టించబోతున్నారు. ఈ నెల 10న ఇండియాకు అత్యధిక కాలం పని చేసిన ప్రధానిగా నిలవబోతున్నారు. అది కూడా ఎన్నికల్లో గెలిచి, అత్యధిక రోజులు ప్రధానిగా కొనసాగిన జవహర్ లాల్ నెహ్రూను దాటేయబోతున్నారు. దేశ తొలి ప్రధాని నెహ్రూ మే 13, 1952న పదవీ బాధ్యతలు చేపట్టారు. మే 27, 1964న ఆయన మరణించేవరకు ప్రధానిగానే ఉన్నారు. అలా మొత్తం 4,398 రోజులు ప్రధానిగా కొనసాగారు. ఇంతకాలం పదిలంగా ఉన్న ఈ రికార్డును మోదీ జూన్ 10న చెరిపేయబోతున్నారు. ఈ నెల 10తో మోదీ ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకుంటారు. మోదీ మొదటిసారిగా మే 26, 2014న ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచి ఇప్పటివరకు ఆయన ప్రధానిగా కొనసాగుతున్నారు. మోదీ ఇంతకుముందు కూడా ప్రధానిగా మరో రికార్డును బద్దలుకొట్టారు. వరుసగా, అత్యధిక కాలం ప్రధానిగా ఉన్న ఇందిరా గాంధీ రికార్డును జూలై 5, 2025న దాటేశారు. ఇందిరాగాంధీ జనవరి 24, 1966న ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టి, వరుసగా 4,077 రోజులపాటు కొనసాగారు. ఆమె మార్చి 24, 1977లో వరకు ప్రధానిగా కొనసాగారు. అలా, ఇందిరా గాంధీ కంటే ఎక్కువ రోజులు వరుసగా ప్రధానిగా మోదీ కొనసాగుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో నెహ్రూ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి దేశ జనాభా దాదాపు 34 కోట్లు. కానీ, మోదీ 2014లో పదవి చేపట్టే సమయానికి దేశ జనాభా 131 కోట్లు. ప్రస్తుతం 146 కోట్లు అని అంచనా. ఇన్నేళ్లలో దేశంలో ప్రజాస్వామ్యం, రాజకీయ పార్టీల భాగస్వామ్యం కూడా పెరిగింది. దేశంలో తొలి ఎన్నికలు జరిగిన 1951?52లో 53 రాజకీయ పార్టీలు పోటీ చేశాయి. 2014 లోక్‌సభ ఎన్నికల సమయానికి దేశంలో 464 పార్టీలు పోటీచేయగా, 2024 ఎన్నికల సమయానికి 744 పార్టీలు పోటీ చేశాయి. దేశ తొలి ఎన్నికల సమయంలో 17 కోట్ల మంది ఓటు వేయగా, 2014 నాటికి దాదాపు 84 కోట్ల మంది ఓటు వేశారు. నెహ్రూ హయాంలో కాంగ్రెస్ ఆధిపత్యమే ఎక్కువగా ఉండేది. అప్పట్లో 489 లోక్‌సభ స్థానాలుంటే అందులో 364 సీట్లు కాంగ్రెస్ దక్కించుకుంది.

# ప్రపంచ స్థాయి మెడికల్ టూరిజం కేంద్రంగా హైదరాబాద్



హైదరాబాద్: భారత్‌లో పర్యటిస్తున్న దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలే నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందంతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, మెడికల్ టూరిజం, పరిశ్రమలు, పెట్టుబడులు వంటి పలు రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించుకోవడంపై ఇరు పక్షాలు చర్చించాయి. తెలంగాణ, ముఖ్యంగా హైదరాబాద్ ప్రత్యేకతలను దక్షిణాఫ్రికా ప్రతినిధులకు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. అత్యాధునిక రంగాలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను తయారు చేసి ప్రపంచానికి అందించే కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి చెందిందని సీఎం తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని దక్షిణాఫ్రికా బృందాన్ని కోరారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి మెడికల్ టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ఈ రంగంలో దక్షిణాఫ్రికా కలిసి పనిచేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2026'లో పాల్గొనాలని దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలేతో పాటు అక్కడి పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలను సీఎం ఆహ్వానించారు. సీఎం ఆహ్వానంపై మషాటిలే స్పందిస్తూ.. పెద్ద సంఖ్యలో తమ ప్రతినిధులు పాల్గొంటారని, ఈ సదస్సు ద్వారా ఇరు దేశాల మధ్య వ్యాపార, పారిశ్రామిక సంబంధాలు మరింత బలపడతాయని అభిప్రాయపడ్డారు. అనంతరం జర్మనీలోని తురింగియా రాష్ట్ర ప్రభుత్వం ప్రతినిధులతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో వేగంగా విస్తరిస్తున్న శాస్త్ర సాంకేతిక, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, జీవ వైజ్ఞానిక రంగాల్లో పరస్పర సహకారాన్ని ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వంతో తురింగియా ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

# నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**323 పాయింట్లు నష్టపోయిన బీఎస్ఈ సెన్సెక్స్**

ముంబై: భారత స్టాక్ మార్కెట్లు బుధవారం నష్టాల్లో ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 323 పాయింట్లు నష్టపోయి 74,326 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 86 పాయింట్లు నష్టపోయి 23,396 వద్ద ముగిసింది. ఉదయం ట్రేడింగ్ నష్టాలతోనే ప్రారంభమైంది.

సెన్సెక్స్ 74,300 పాయింట్లతో, 350కిపైగా పాయింట్ల నష్టంతో ప్రారంభమైంది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 100 పాయింట్ల నష్టంతో 23,400 వద్ద ప్రారంభమైంది. రోజంతా ట్రేడింగ్ నష్టాల బాటలోనే సాగింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పాలసీ మీటింగ్ ఈ రోజు ప్రారంభమైంది. వారాంతం వరకు కొనసాగనుంది. దీంతో వడ్డీ రేట్లు, ద్రవ్యోల్బణం వంటి అంశాల్లో ఆర్బీఐ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది అనే అంశంపై ఇన్వెస్టర్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అమెరికా?ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు మార్కెట్‌పై నెగెటివ్ ప్రభావం చూపాయి. హార్ముజ్ జలసంధి పూర్తిగా ఓపెన్ కాకపోవడం, చమురు ధరల పెరుగుదల వంటివి కూడా మార్కెట్‌పై ప్రభావం చూపాయి. దీంతో అమ్మకాల ఒత్తిడి పెరిగి మార్కెట్ నష్టాల్లో ముగిసింది.

సెన్సెక్స్ 30 సూచీలో టీసీఎస్, ఇన్ఫోసిస్, ఐటీసీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్ర షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. వీటిలో టీసీఎస్ షేర్ దాదాపు 9 శాతం పతనమైంది. కోవిడ్ తర్వాత టీసీఎస్ షేర్లు ఈ స్థాయిలో పతనమవ్వడం ఇదే మొదటిసారి. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ట్రెంట్, ఇండిగో, ఎస్బీఐ, ఐసీఐసీఐ షేర్లు లాభాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ క్రూడాయిల్ ధర 98 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్స్ ధర అంతర్జాతీయ విపణిలో 4,461 డాలర్ల వద్ద కొనసాగింది. డాలర్‌తో రూపాయి మారక విలువ 95.71గా ఉంది.

# తెలంగాణ అప్పులపై చర్చకు సిద్ధమే



హైదరాబాద్‌వచ్చే ఏడాది పాదయాత్ర చేస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నకు ఈ మేరకు ఆయన సమాధానమిచ్చారు. పాదయాత్ర మొదలయ్యేలోపు ఫిట్ అవ్వాలని చూస్తున్నానని చమత్కరించారు. వచ్చే ఏడాది పాదయాత్ర ఎప్పుడు అనేది పార్టీ నిర్ణయిస్తుందని కేటీఆర్ తెలిపారు. 2027లో కచ్చితంగా పాదయాత్ర ఉంటుందని పునరుద్ఘాటించారు. ఎక్కడి నుంచి ఎక్కడికి, ఏ టైమ్‌లో పాదయాత్ర చేయాలనే దానిపై పార్టీలో పెద్దలతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. కడుపులో కత్తులు పెట్టుకుని.. పెదవులపై చిరునవ్వులు పెట్టుకునే తెలివితేటలు తనకు లేవని ఈ సందర్భంగా కేటీఆర్ అన్నారు. అందుకే తనకు అహంకారమని అంటారేమో అని తెలిపారు. మీకు అహంకారమని అంతా అనుకుంటారని ఇంటర్వ్యూల్లో చెప్పారు కదా.. దాని గురించి ఎప్పుడైనా ఆలోచిస్తారా అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు కేటీఆర్ ఈ మేరకు స్పందించారు.

నాకు అహంకారమని అంతా ఎందుకు అనుకుంటారని కచ్చితంగా ఆలోచిస్తుంటానని కేటీఆర్ తెలిపారు. అయితే కొంతమందికి కొన్ని కొన్ని మ్యాన్యుఫ్యాక్షరింగ్ డిఫెక్ట్ ఉంటాయని అన్నారు. అలాగే తనకు బాడీ లాంగ్వేజ్ సమస్య ఉందని తెలిపారు. అందుకే నవ్వుతూ మాట్లాడమని మిత్రులు చెబుతుంటారని.. కానీ అలా లేని నవ్వు తెచ్చుకుని నాకు మాట్లాడటం రాదని చెప్పారు. తెలంగాణ వాడిని కదా.. కడపులో కత్తులు, పెదవులపై చిరునవ్వులు పెట్టుకునే తెలివితేటలు తనకు లేవని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆర్థిక విప్లవాన్ని తీసుకొచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వం అని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ అభివృద్ధిలో నంబర్‌వన్‌గా ఎదిగిందని పేర్కొన్నారు. తెలంగాణ కంటే ఎక్కువ అభివృద్ధి ఏ రాష్ట్రంలో జరగలేదని స్పష్టం చేశారు. అమలు కాని హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తెలిపారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలిచ్చి కాంగ్రెస్ మాట తప్పిందని అన్నారు. రెండేళ్లుగా ప్రభుత్వ ఆదాయం పతనమవుతోందని తెలిపారు. కరోనా కంటే డేంజర్ కాంగ్రెస్ పార్టీ అని ప్రజలకు అర్థమైందని అన్నారు. ఆర్థిక పరిస్థితి బాగోలేదంటూనే ప్రభుత్వ ప్రకటనల కోసం కోట్లు ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర అప్పులపై కాంగ్రెస్ అసత్య ప్రచారం చేస్తుందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేసిన అప్పు రూ.2.8 లక్షలు మాత్రమేనని తెలిపారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ పార్టీ రూ.4లక్షల కోట్ల అప్పులు చేసిందని పేర్కొన్నారు. అప్పులు చేడయంలో రేవంత్ ప్రభుత్వం రికార్డులు సృష్టిస్తోందని విమర్శించారు. అప్పు చేసి తీసుకొచ్చిన ఈ డబ్బంతా ఎక్కడికి పోతుందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ చేసిన అప్పులు తీరుస్తున్నామని కాంగ్రెస్ చెబుతున్నది కాకిలెక్కలు అని కేటీఆర్ అన్నారు. ఏడాది కాలంలో రూ.29వేల కోట్ల అప్పు మాత్రమే తీర్చారని తెలిపారు. నెలకు రూ.6వేల కోట్ల అప్పు తీరుస్తున్నమనేది అబద్ధమని స్పష్టం చేశారు. రూ.2వేల కోట్లే చెల్లిస్తున్నారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ వల్ల తెలంగాణకు ముప్పు పొంచి ఉన్నదని హెచ్చరించారు. రాష్ట్ర అప్పులపై సీఎం రేవంత్ రెడ్డితో చర్చలకు సిద్ధమని స్పష్టం చేశారు.

# ఆరోగ్యం ఉంటేనే సంపద



గుంటూరు: ఎంత సంపద ఉన్నా.. ఆరోగ్యం అవసరమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సంపూర్ణ ఆరోగ్యం ఉన్నవారే నిజమైన ధనవంతులని పేర్కొన్నారు. బుధవారం గుంటూరు జిల్లాలోని తక్కెళ్లపాడులో సీఎం చంద్రబాబు పర్యటించారు. లలిత ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగించారు. వేల కోట్లు, పదవులు ఉన్నా ఆరోగ్యం లేకపోతే లాభంలేదని చెప్పుకొచ్చారు. లలిత ఆస్పత్రి.. ల్యాండ్‌మార్క్ ఇన్‌స్టిట్యూట్‌గా తయారు కావాలని ఆకాంక్షించారు. ఈ హాస్పిటల్లోని స్కానర్ సౌత్ ఇండియాలోనే లేదని చెప్పుకొచ్చారు. లలిత ఆస్పత్రి 600 పడకల సామర్థ్యంతో 900 మంది సిబ్బందితో ప్రారంభమైందని సీఎం చంద్రబాబు తెలిపారు. 32 విభాగాలకు వైద్యసేవలు అందించే ఏకైక కేంద్రం ఇదని వివరించారు. ప్రజల్లో నమ్మకం, విశ్వసనీయత ఉంటేనే.. ఏ వ్యవస్థ అయినా మనుగడ సాధ్యమని పేర్కొన్నారు. పేదల ఆరోగ్యం కాపాడేందుకు అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. ఆరోగ్యం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంచి అలవాట్లతోనే ఆరోగ్యం కాపాడుకోవచ్చని చెప్పారు. యోగా, ధ్యానం చేస్తే అనారోగ్యం దరిచేరదని పేర్కొన్నారు. మనిషికి ఆరోగ్యాన్ని మించిన ఆస్తి లేదని సీఎం చంద్రబాబు తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్న వారే నిజమైన ధనవంతులని చెప్పుకొచ్చారు. ఆరోగ్యవంతులైన పౌరులు ఆరోగ్యకరమైన దేశాన్ని తయారు చేస్తారని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ బాగా పని చేస్తున్నారని ప్రశంసించారు. స్జబెక్టు అర్థం చేసుకుని వైద్య ఆరోగ్య శాఖను చక్కగా నిర్వహిస్తున్నారని చెప్పారు. సంజీవని పేరుతో డిజిటల్ హెల్త్ రికార్డు ప్రాజెక్టు తెస్తున్నామని తెలిపారు. ప్రపంచంలోని అత్యుత్తమ వైద్య పరిజ్ఞానం తెచ్చి ప్రజలకు ఇస్తామని అన్నారు. వ్యాధులు రాకుండా ఏం చేయాలో, వ్యాధి నిర్ధారణ నివారణకు సంబంధించి అత్యుత్తమ విధానాలు అమలు చేస్తామని తెలిపారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ తెచ్చి రెండున్నర లక్షల వరకూ ఉచిత వైద్యం అందిస్తామని స్పష్టం చేశారు. పేదల ఆరోగ్యం కాపాడేందుకు ఏం చేయాలో అన్నీ చేస్తామని.. కానీ అనారోగ్యానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. తినే తిండి, మంచి అలవాట్లు, మన పరిసరాలు, మనం ఆలోచించే విధానం ఆరోగ్యానికి చాలా ముఖ్యమని వివరించారు. యోగా, ధ్యానం, ప్రాణాయామం వంటి వాటికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మనం తినే ఆహారం మన ఆరోగ్యాన్ని కాపాడేలా ఉండాలని అన్నారు. గతంలో పంటలను రసాయన ఎరువులు, పురుగు మందులు వేయకుండా పండించామని ప్రస్తావించారు. జగన్ హయాంలో నాసిరకం మద్యం కారణంగా చాలామందికి ఆరోగ్య సమస్యలు వచ్చాయని అన్నారు. వైసీపీ హయాంలో దుర్మార్గమైన నిర్ణయంతో ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీశారని ధ్వజమెత్తారు. క్వాంటం, ఏఐ, డేటా సెంటర్, డిఫెన్స్ రీసెర్చ్ వంటి విభిన్న సాంకేతిక రంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని వ్యాఖ్యానించారు. ఇంట్లోనే ఉంటూ ఫోన్లు వాడితే ఎలా...? కుటుంబ సభ్యులు నేరుగా మాట్లాడుకోవాలని సూచించారు. పది నిమిషాలు వ్యాయామం చేయటానికి ఓపిక లేకపోతే ఎలా..? అందుకే అనారోగ్య సమస్యలు పెరిగిపోతున్నాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

ఈనెల 21వ తేదీన మరోసారి యోగా ద్వారా రికార్డులు సృష్టిద్దామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. కృష్ణా నది బైపాస్ రహదారిపై యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా సంప్రదాయ వైద్య విధానాలు ప్రమోట్ చేస్తున్నారని తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమానికి గిన్నిస్ రికార్డులు వచ్చాయని ప్రస్తావించారు. మెడిటేషన్ యోగా కేంద్రాలు ఆస్పత్రిలో ఏర్పాటు చేయాలని సూచించారు. రైతన్నలు ప్రకృతి వ్యవసాయం చేయాలని సీఎం ఆకాంక్షించారు.ప్రస్తుతం 20 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని సీఎం చంద్రబాబు వివరించారు. రాబోయే రోజుల్లో 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తామని అన్నారు.

# తెలంగాలో పోటీచేసేది అక్కడి భూమి పుత్రులే

అమరావతి: మా ఇల్లు ఉన్న తెలంగాణకు నేను వెళ్లకూడదా అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ నిలదీశారు. అమరావతిలో మాట్లాడిన సందర్భంలో పవన్ ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ జనసేన నేతలు పోరుపెడితే అక్కడికి వెళ్లానని.. పుష్కర కాలం తర్వాత కూడా అంత ద్వేషం ఊహించలేదని జనసేన అధినేత వాపోయారు. తాను తెలంగాణ ప్రజలను ఉద్దేశించి చెడుగా మాట్లాడ లేదని, తెలంగాణ ముమ్మాటికీ ఆ ప్రాంత భూమిపుత్రులదేనని పవన్ స్పష్టం చేశారు. దేశంలో బతకడం మన హక్కు అని, కాలరాసే హక్కు ఎవరికీ లేదని చెప్పుకొచ్చారు. 2014 నుంచి 2024 వరకు ఎంతమంది తెలంగాణ కాంట్రాక్టర్లు ఏపీకి రాలేదని పవన్ ప్రశ్నించారు. కేటీఆర్ తనకు సోదరుడు లాంటివారని పవన్ కల్యాణ్ తెలిపారు. ఏపీ నుంచి వెళ్లి తెలంగాణలో ఎవరూ పోటీ చేయడం లేదని.. జనసేనలోని తెలంగాణ భూమిపుత్రులే అక్కడ పోటీ చేస్తామంటున్నారని -పవన్ కల్యాణ్ చెప్పారు. విభజించుకుంటూ వెళ్తే ఎక్కడికి వెళ్తామని, భూమికి సరిహద్దులు ఉంటాయని, మనసుకు ఉండవని పవన్ వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర, తమిళనాడు వెళ్తే ఎక్కడా ఇబ్బందులు లేవని.. ఇదంతా సీఎం రేవంత్‌కు తెలిసి జరిగిందని అనుకోవడం లేదని పవన్ అభిప్రాయపడ్డారు. 'రాహుల్, ప్రియాంక వయనాడ్ వెళ్లి పోటీ చేయొచ్చా' అని పవన్ నిలదీశారు. దేశ సమగ్రతను దెబ్బతీసేలా ఎవరూ వ్యవహరించొద్దని హితవు పలికారు.

# తెలంగాణలో భూముల విలువల్లో సవరణ



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం భూములు, ప్లాట్లు, ఫ్లాట్ల మార్కెట్ విలువల సవరణకు ఆమోదం తెలిపింది. కొత్త మార్కెట్ విలువలు ఈ నెల 5వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి. క్షేత్రస్థాయి అధ్యయనం, మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్ల ధోరణి, డిమాండ్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్రంలోని 144 సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో భూముల మార్కెట్ విలువలు పెరిగాయి. ఔటర్ రింగ్ రోడ్ , రీజినల్ రింగ్ రోడ్ , అభివృద్ధి కారిడార్లు వంటి ప్రాజెక్టుల ప్రభావాన్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. ఈ ప్రాంతాల్లో భూముల విలువలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో మార్కెట్ విలువలను సవరించింది. ఫ్లాట్ల మార్కెట్ విలువల్లో ఉన్న అసమానతలను తొలగించేందుకు హేతుబద్ధీకరణ చేపట్టింది. కొన్ని ప్రాంతాల్లో అన్ని అంతస్తుల ఫ్లాట్లకు ఒకే మార్కెట్ విలువను అమలు చేయాలని నిర్ణయించింది. అలాగే హెచ్ఎండిఎ, క్యూర్ ఇతర ప్రాంతాలకు కనీస ప్రాథమిక మార్కెట్ రేట్లను నిర్ణయించింది. వ్యవసాయ భూములు, ప్లాట్లు, ఫ్లాట్లకు కొత్త కనీస మార్కెట్ విలువలను ఖరారు చేయడంతో పాటు నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ రేట్లను కూడా సవరించింది. ఆర్‌సీసీ, నాన్-ఆర్‌సీసీ నిర్మాణాలకు సంబంధించిన విలువల్లో మార్పులు చేసింది. భూ లావాదేవీల్లో పారదర్శకతను పెంచడం, మార్కెట్ ధరలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ విలువలను నిర్ణయించడం ఈ సవరణల ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో సవరించిన భూముల మార్కెట్ విలువలు జూన్ 5 నుంచి అమల్లోకి వస్తాయని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. భూముల విలువల సవరణ శాస్త్రీయంగా, హేతుబద్ధంగా చేపట్టామన్నారు. క్షేత్రస్థాయి అధ్యయనం, మార్కెట్ పరిస్థితుల మేరకు కొత్త విలువలు ఉన్నాయన్నారు. నిపుణుల సూచనలు, అధికారుల సలహాలతో నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ప్రాంతాలవారీగా మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్లు పరిశీలించామన్నారు. భూలావాదేవీల్లో సమస్య పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా పునఃపరిశీలన చేశాం. 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో మార్కెట్ విలువలపై సమీక్ష జరిపాం. గ్రామీణ, పట్టణ మార్కెట్ విలువల సవరణ కమిటీలు అధ్యయనం చేశాయి.

అభివృద్ధి, భూముల డిమాండ్, మార్కెట్ పరిస్థితులు, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్, కొత్త రోడ్లు, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణను ప్రమాణాలుగా తీసుకున్నాం. ఎ÷-లాట్ల విషయంలో అసమానతలు తొలగిస్తూ కొన్ని చోట్ల అన్ని అంతస్తులకు ఒకే ధర ఉంటుంది. ఇప్పటికే అధిక ధర ఉన్నచోట పెంపు ప్రతిపాదనలు లేవు. హెచ్ఎండీఏ, క్యూర్, ఇతర ప్రాంతాలకు ప్రాథమిక మార్కెట్ రేట్లు నిర్ణయించాం. 2021 తర్వాత నిర్మాణ వ్యయాలు సవరించడంతో కొత్త ధరల అవసరం ఏర్పడింది.

# మద్యం ఆదాయంపై ప్రత్యేక దృష్టి

**అందుబాటులోకి కొత్తగా 150, 200 ఎంఎల్ బాటిళ్లు**

హైదరాబాద్:తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మద్యం విక్రయాలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న మద్యం సీసాల పరిమాణాలకు అదనంగా కొత్త సైజులను ప్రవేశపెట్టేందుకు చర్యలు ప్రారంభించింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ పాత నిబంధనలను సవరిస్తూ తాజా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం మార్కెట్లో 90ఎంఎల్, 180ఎంఎల్, 375ఎంల్, 750ఎంఎల్ పరిమాణాల్లో మద్యం బాటిళ్లు అందుబాటులో ఉన్నాయి. వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వీటితో పాటు కొత్తగా 150, 200 ఎంఎల్ పరిమాణాల్లో మద్యం సీసాలను కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. అయితే, కొత్త సీసాల పరిమాణాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ మద్యం ధరల్లో ఎలాంటి మార్పులు ఉండబోవని ఎక్సైజ్ శాఖ స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం మద్యం మార్కెట్లో కొత్త మార్పులకు దారితీయనుంది.

# ఢిల్లీ హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం

**21మంది దుర్మరణం చెందినట్లు గుర్తింపు**

**ప్రమాద ఘటనపై ప్రధాని మోడీ దిగ్భ్రాంతి**

న్యూఢిల్లీ,:దేశ రాజధాని ఢిల్లీలోని ఓ హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిప్రమాదం కారణంగా 21 మంది చనిపోగా.. 20 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. మల్వియా నగర్‌లోని, హౌజ్ రాణీ లైన్‌లో ఐదంతస్తుల భవనం ఉంది. భవనం బేస్‌మెంట్‌లో 'లెమన్ గ్రీన్ రెస్టారెంట్' ఉంది. బుధవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. మంటల్లో చిక్కుకుని 21 మంది ప్రాణాలు కోల్పోయారు. 20 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన సమయంలో హోటల్‌లో 40 మందికి పైగా జనం ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో ఎక్కువ మంది మధ్య ఆసియా, ఆఫ్రికాకు చెందిన వారు ఉన్నట్లు సమాచారం. ప్రమాదం జరగడానికి గల కారణాలు తెలియరావాల్సి ఉంది. హోటల్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 2లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ఇస్తామని తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# గుడ్డ కాల్చి మీద వేస్తామంటే ఊరుకోం



అమరావతి డీఎస్సీలో అక్రమాలు జరిగాయని ఏ ఆత్మ చెప్తే.. జగన్ 9 నెలల తర్వాత విషప్రచారం మొదలుపెట్టారంటూ హోం మంత్రి వంగలపూడి వ్యాఖ్యానించారు. గుడ్డ కాల్చి ముఖాన వేస్తే తుడుచుకునే పరిస్థితుల్లో లేమని అన్నారు. ఎవరు కాల్చారు, ఏ ఉద్దేశ్యంతో కాల్చారో ప్రజలకు ప్రతిదీ బహిర్గతం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ మురకు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై హోం మంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రజలకు అర్థమయ్యేలా సమాధానం చెప్తామని.. విషప్రచారాలను కట్టడి చేస్తామన్నారు. తప్పుడు ప్రచారాలు చేసే వారిపై క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న వారిలో అత్యధిక శాతం టీడీపీ ప్రభుత్వంలో నియమితులైన వారే అని మంత్రి అన్నారు. డీఎస్సీంద పోస్టింగ్ అనేది ఎన్నో కుటుంబాలకు ఎమోషనల్ బాండింగ్ అని తెలిపారు. ఏ కోర్టు కేసూ అడ్డంకి రాకుండా అన్ని సమస్యలూ పరిష్కరించి గౌరవ ప్రదంగా ప్రతి ఒక్కరికీ నియామకపత్రాలు అందజేశామన్నారు. లీక్‌కు స్కోప్ లేకపోవటంతో స్పోర్ట్స్ కోటాపై పడ్డారని మండిపడ్డారు. బీకాంలో కెమిస్ట్రీ చదివిన ఘనులంతా గొడ్డలిపార్టీలో ఉండి ఏది పడితే అది మాట్లాడుతున్నారని సెటైర్ విసిరారు. సమాధానం అవసరం లేదని, సమస్య సృష్టించటమే అవసరం అన్నట్లుగా వారి వ్యవహార శైలి ఉందన్నారు. గొడ్డలి పార్టీ అధికారంలో ఉండగా 2022లో తెచ్చిన హారిజాంటల్ రిజర్వేషన్ ఆధారంగానే డీఎస్సీ నియామకాలు జరిగాయని హోంమంత్రి చెప్పారు. ఉపాధ్యాయులను మద్యం దుకాణాల ముందు పెట్టిన మహామహులు బ్రిడ్జి స్పోర్ట్స్ గురించి అవగాహన లేమితో మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. బ్రిడ్జ్ స్పోర్ట్స్ అంటే గొడ్డలి పార్టీ నేతలు నిర్వహించిన పేకాట క్లబ్‌లు కాదన్నారు. గత ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్1 నియామకాలు ఏ పరిస్థితుల్లో ఉన్నాయో అందరికీ తెలుసని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.

# చికిత్స పొందుతూ మూడు నెలల చిన్నారి మృతి





## న్యాయం కోసం ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన..

**కరీంనగర్ జూన్ 03, మనసాక్షి :**

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేట్ హాస్పిటల్లో దారుణం చోటు చేసుకుంది. చికిత్స పొందుతూ మూడు నెలల చిన్నారి ప్రాణం గాల్లో కలిసిందని తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు ఆరోపించారు . ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. వివరాల్లోకి వెళితే హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లి గ్రామానికి చెందిన ఎలాబోయిన వెంకటేష్ -వర్షిత దంపతులకు జన్మించిన మూడు నెలల బాబు మంగళవారం ఉదయం బాగా ఏడుస్తున్నాడని చికిత్స కోసం కరీంనగర్ లోని ఓ నర్సింగ్ హోమ్ పిల్లల ఆసుపత్రికి తీసుకువచ్చినట్లు తెలిపారు. వైద్య పరీక్షలు చేసిన డాక్టర్ రమేష్ బాబు చెవి నొప్పితో ఏడుస్తున్నాడని, అడ్మిట్ కావాలని బాబు తల్లిదండ్రులకు సూచించారు. తమ హాస్పిటల్లో అడ్మిట్ చేసుకున్న వైద్యులు బాబు చెవిలో డ్రాప్స్ వేసి సెలెన్ బాటిల్ పెట్టి, కడుపు నొప్పితో బాబు బాధపడుతున్నాడేమోనని స్కానింగ్ కూడా తీసినట్లు బాబు తల్లిదండ్రులు తెలిపారు. అయినా మరుసటి రోజు బుధవారం కూడా బాబు ఏడుపు ఎంతకు ఆపడం లేదంటు కుటుంబ సభ్యులు ఆసుపత్రి సిబ్బందికి తెలుపగ వైద్యులు నిర్లక్ష్యంగా వచ్చి చూసే లోపే బాబు ప్రాణాలు కోల్పోయాడని ఆరోపించారు. వైద్యులు అందుబాటులో లేకపోవడంతోనే తమ బాబు మృతి చెందడంటూ కుటుంబ సభ్యులు బంధువులతో కలసి హాస్పిటల్ ఎదుట బైటయించి ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని అదుపు చేస్తున్నారు. బాధితులకు న్యాయం చేయాలనీ డిమాండ్ చేస్తూ పలు సంఘాల నాయకులు మద్దతుగా నిలిచారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన హాస్పిటల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని హాస్పిటల్ లైసెన్స్ రద్దు చేయాలనీ డిమాండ్ చేస్తున్నారు.

# నూతన కార్యదర్శులు విధుల్లో చేరిక

**కంగ్టి, జూన్ 03, మన సాక్షి :-**



కంగ్టి మండల మండలానికి నూతనంగా నలుగురు కార్యదర్శులు వచ్చారని ఎంపిడిఓ లక్ష్మణ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంగ్టి - పవన్ కుమార్, నాగూర్ బీ - నవీన్ రెడ్డి, ఎన్నెమూరి - మారుతి, భీమ్రా తస్లీమా,నూతన కార్యదర్శులు వచ్చారని చెప్పారు. మండలంలో పనిచేస్తున్న 12 మంది కార్యదర్శులను బదిలీలో వెళ్లారన్నారు. మండలంలో 33 పంచాయతీలకు గాను 21 కార్యదర్శులు,ఇంకా 12 తక్కువ ఉన్నాయి. 12 గ్రామ పంచాయతీలకు ఇన్చార్జిలను నియమించామన్నారు.

# మిరియాల పంట సాగుపై రైతులకు అవగాహన

**రామసముద్రం జూన్ 3 మనసాక్షి**



అన్నమయ్య జిల్లా రామసముద్రం మండల కేంద్రంలోని శ్రీ శక్తి భవనంలో మిరియాలు సాగుపై వి వో ఎ,వి వో లు, సంఘమిత్రాలు, రైతులకు ఏ పీ ఎం సాంబ శివ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమంనిర్వహించారు, ఈ సమావేశానికి పీ డీ నాగేశ్వర్ రావు, సత్యనారాయణ, గంగాధర్, సి సి లు హాజరయ్యారు, వీరు మాట్లాడుతూ. గత నెలలో మండలంనుండి రైతులు మన్యం జిల్లా లోని పాడేరు వెళ్లి వారు సాగు చేసిన మిరియాలు పంటలను పరిశీలించ్చారని, అక్కడ అంతర పంటలు, కాఫీ తోటలు, టీ ఆకు,మిరియాలు ఎక్కువగా పండిస్తున్నారని,అక్కడ రైతులు మిరియాలు సాగు చేస్తున్నారని, దిగుబడిలోనే కాకుండ నాన్యతలోను పాడేరు మిరియాలు పండిస్తున్నారని, మండలం నుండి కేరళ అయ్యప్ప స్వామి ఆలయానికి వెళ్లే దారిలో ఎటు చూసిన పొడవాటి మొక్కలకు తమలపాకులతీగులు వలె అల్లించడం చూసామని అవే మిరియాలు చెట్లు అని, 1700 అడుగులు నుండి 4200 అడుగులోనే మిరియాలు సాగు పండిస్తుంటే,మనం వారికంటే ఎత్తులో ఉన్నాం కాబట్టి మనం కూడ మిరియాలు సాగుచేసి లాబాలు అర్జించాలన్నారు, ఈ మిరియాల పంట ద్వారా మన్యం రైతులు రూ. 100,కోట్లు నుండి 150 కోట్లవరకు ఆదాయాన్ని పొందుతున్నారని, కాఫీ తోటల్లో అంతర పంటగా మిరియాలు సాగు చేసి అదిక లాభాలు అర్జిస్తున్నారని, వారిని చూసి మండల రైతులు మిరియాలు పంట సాగు చేసి అదనపు ఆదాయం సమకూ ర్చుకోవాలన్నారు, మండలం లోని రైతులు టమోటా, వరి పై ఎక్కువగా మక్కువ చూపడం జరుగుతుందని ఒకసారి లాబాలు వస్తాయని,ఎక్కువగా నష్టాలే తీసుకువస్తాయని,మిరియాలు పంటకు ఈ మండలం వాతావరణానికి అనుకూలంగా ఉంటుందని, మిరియాలు పంట 3.2 కిలోల పచ్చి మిరియాలను ఎండబెడితే ఒక కిలో ఎండు మిరియాలు వస్తాయని వాటి ధర కిలో 360 నుంచి 400 వరకు పలుకు తాయని దేశంలోనే అత్యధికం గా మిరియాలు వాడకం జరుగుతుందన్నారు, మండలంలోని రైతులు మిరియాలు పంటసాగు చేయడానికి ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని, మహిళా సంఘం వారికి 3 లక్షలు వరకు లోన్ సదుపాయం అందించడం జరుగుతుందని
, మిరియాలు సాగు పై మక్కువ గల రైతులకు
పాడేరు లోని సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐ టి డి ఏ ) ద్వారా మొక్కలు సాగుచేస్తున్నారని, అక్కడ నర్సరీ ల్లో పలు రకాల మొక్కలు ఉన్నాయని ఆసక్తి కలవారు అధికారులకు తెలియపరచాలన్నారు. మునగాకు సాగుపై రైతులు ద్రుష్టి పెట్టాలని, మునగాకు కు డిమాండ్ ఉన్నదని అనంతపురం రైతులు సాగు చేసి అధిక లాభాలు అర్జిస్తున్నారన్నారు,ఈ సమావేశంలో పి డి నాగేశ్వర్ రావు, గంగాధర్, సత్యనారాయణ, సాంబశివ, శ్రీనివాసులు,షాన్ వాజ్, వి ఏ వో, వి వో లు రైతులు సంఘ మిత్ర సభ్యులు హాజరయ్యారు.

# సైబర్, క్రైంలపై అవగాహన

**రామసముద్రం జూన్ 3 మనసాక్షి**



అన్నమయ్య జిల్లా రామసముద్రం మండల కేంద్రంలోని కర్ణాటక భార్డర్ ర్లో బుధవారం ప్రజలకు సైబర్ క్రైమ్ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు, ఎస్సై మాట్లాడుతూ బయట ప్రాంతాలకు వెళ్లే టప్పుడు మీ ఇంటి తాలాలను వేసి, గేటు కు బీగాలు వేసి భద్రపరుచుకోవాలని, పక్క ఇంటి వాళ్ళకు తెలియపరచాలని, ప్రతి ఇంటికి సి సి కెమెరాలు అమర్చుకోవాలని, బంగారు, డబ్బులు ఇంటిలో ఉంచుకోకండి, వేరే ఊళ్లకు వెళ్ళేటప్పుడు పోలీస్ వారికి తెలియపరచాలని, వాహనాల్లో, బస్సుల్లో, రైళ్లల్లో ప్రయాణం చేసేటప్పుడు మీ వస్తువులు జాగ్రత్తగా ఉండాలని,ప్రతి ఒక్క ద్విచక్రదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలను రక్షించుకోవాలన్నారు. హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపితే 1035 జరిమానా విధిస్తామని మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లి దండ్రులు పై కేసులు నమోదు చేసి 25 వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. తల్లి దండ్రులు విద్యా ర్థుల పై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ముఖ్యం గా సైబర్ నేరగాళు వలలో పడకండి వారి చెప్పే మాటలకు మోసపోకండి జాగ్రత్తగా ఉండాలని సైబర్ నేరగాళ్లు మీ బ్యాంకు అకౌంట్ నంబర్, ఓటిపి చెప్పండి అని అడుగుతారు మీరు చెప్పకండి, మీకు ఏమైనా సందేహం వస్తే పోలీస్ లు సంప్రదించండన్నారు. ఏళ్ల వేళలో మా సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు,ఈ సమావేశం లో ఎస్సై హృషికేశవరెడ్డి పోలీస్ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

# చాఫ్ కట్టర్ లో చేయి ఇరుక్కుని బాలుడికి గాయం

**రామసముద్రం జూన్ 3 మనసాక్షి**



అన్నమయ్యజిల్లా రామసముద్రం మండలం తిరుమలరెడ్డి పల్లి గ్రామానికి చెందిన నబి సాహెబ్ కుమారుడు మహమ్మద్ (12) ప్రమాదవశాత్తు గడ్డి కత్తిరించే యంత్రం (చాఫ్ కట్టర్)లో చేయి పెట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనలో బాలుడి కుడి చేయి పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. వెంటనే కుటుంబ సభ్యులు బాలుడిని చికిత్స నిమిత్తం మదనపల్లెలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# అభివృద్ధి పనులను పరిశీలించిన జోనల్ కమిషనర్

**శేరిలింగంపల్లి 03 జూన్ మన సాక్షి**



మియాపూర్ సర్కిల్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ ఐఏఎస్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్దకుడి చెరువు, పటేల్ చెరువు వద్ద జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. అనంతరం జాతీయ రహదారి వెంబడి, మియాపూర్ సర్కిల్‌లోని వివిధ కాలనీలలో వర్షపు నీరు నిల్వ అవుతున్న ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ డ్రైనేజీ మెరుగుదల పనులను వేగవంతం చేయాలని, నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెరువుల అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అలాగే వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నీటి నిల్వ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు అందించే దిశగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్‌తో పాటు ఇంజనీరింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# వేరుశనగ రాయితీ విత్తనం కోసం దరఖాస్తులు

**రామసముద్రం జూన్ 3 మనసాక్షి**



అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలంలోని రైతులు కోసం ఖరీఫ్ సీజన్ కొరకు రాష్ట్ర ప్రభుత్వం వేరుశనగ విత్తనాలు రామ సముద్రం మండలంకు కె 6 రకం 500 క్వింటాళ్లు, టీసీజీ ఎస్ 1694 రకం 560 క్వింటాళ్లు, మొత్తం 1060 క్వింటాళ్లు కేటాయించడం జరిగిందని ఏ వో జాఫర్ తెలిపారు . ఆయన మాట్లాడుతూ విత్తనాలు కావలసిన రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డుతో సంబంధించిన రైతు సేవా కేంద్రం నందు రిజిస్ట్రేషన్ చేసుకొవాలని వేరుశనగ విత్తనం 30 కేజీల బస్తా పూర్తి ధర 3060.40%సబ్సిడీ పోను 1836 రూపాయలుగా నిర్ణయించడం జరిగిందన్నారు.

# స్వచ్ఛ పథంలో పాల్గొన్న డిప్యుటీ ఎంపిడివో

**రామసముద్రం జూన్ 3 మనసాక్షి**



అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలంలోని పెద్దకురప్పల్లె గ్రామ పంచాయతీ లో ని తిరుమలరెడ్డిపల్లె, మట్లవారిపల్లె గ్రామాల్లో స్వచ్ఛ పథం కార్యక్రమం బుదవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలోడిప్యుటీ ఎంపిడివో కృష్ణవేణి పంచాయతీ కార్యదర్శి రెడ్డెమ్మ పాల్గొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి బుధవారం నిరంతర పారిశుధ్య ఉద్యమంగా చేపట్టాలని ప్రభుత్వం నిర్వహించింది. ఈ మేరకు మండలంలోని పెద్దకురప్పల్లె గ్రామ పంచాయతీ లలో స్వచ్ఛ పథం కార్యాక్రమాన్ని నిర్వహించారు. రోడ్డులు, గ్రామాల వీధుల్లోని చెత్త కుప్పలను తొలగించడం, గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగు పరచడం, స్థిరమైన ఘనవ్యర్థాల నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ఉద్దేశమని డిప్యుటీ ఎంపిడివో కృష్ణవేణి అన్నారు,గ్రామంలోని ప్రతి వీధికి వెళ్ళి ప్రజలతో మమేకమై గ్రామాల పారిశుధ్యం పై అవగాహన కల్పించారు,రోడ్ల వెంబడి ఉన్న చెత్తను తొలగించి రోడ్లను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో డిప్యుటీ ఎంపిడివో కృష్ణవేణి డిజిటల్ అసిస్టెంట్ రెడ్డిశేఖర్, అమర, భూలక్ష్మి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# గడ్డపోతారం నూతన కమిషనర్ గా తాన్య



**పటాన్చెరు, జూన్ 03(మనసాక్షి):-**

సంగారెడ్డి జిల్లా గడ్డపోతారం పురపాలక సంఘ కార్యాలయంలో నూతన మున్సిపల్ కమిషనర్‌గా పీ. తాన్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఆమెకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం కమిషనర్ పీ. తాన్య మాట్లాడుతూ... పట్టణ అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ, ప్రజలకు మెరుగైన మున్సిపల్ సేవల అందజేతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జిపై నుంచి దూకి యువతి ఆత్మహత్య

**శేరిలింగంపల్లి 03జూన్ మన సాక్షి**



దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జిపై నుంచి దూకి ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. తమ కూతురు రోజా రమణి (26) కనిపించడం లేదని నాగోల్‌కు చెందిన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. క్రమంలోనే దుర్గంచెరువులో దూకి ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడినట్లుగా పోలీసులు గుర్తించారు. దర్యాప్తులో ఆత్మహత్యకు పాల్పడిన యువతి రోజా రమణిగా నిర్ధారించారు. కాగా, ఆత్మహత్యకు పాల్పడిన యువతి మెడికవర్ ఆస్పత్రిలో అకౌంటెంట్‌గా పనిచేస్తుంది. కొంతకాలంగా బ్యాంక్ లోన్ రికవరీ ఏజెంట్ల వేధింపులు తాళలేకనే ఆమె ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని అనుమానిస్తున్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా త్వరలో సీఎంసీ శంకుస్థాపన



**శేరిలింగంపల్లి 03 జూన్ మన సాక్షి**

మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఖానామెట్‌లో మొండికుంట చెరువు సమీపంలో నిర్మించనున్న సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ప్రధాన కార్యాలయానికి సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా త్వరలోనే శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తెలిపారు. ఈ సందర్భంగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్న స్థలం, సభా ప్రాంగణ ఏర్పాట్లను సీఎంసీ కమిషనర్ సృజన, డీసీపీ రితీరాజ్, జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్, డీసీ బాలకృష్ణతో పాటు ఇంజినీరింగ్, ప్రాజెక్ట్స్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులతో కలిసి పరిశీలించారు. పాల్గొన్నారు. అనంతరం ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన పరిపాలన అందించేందుకు అత్యాధునిక సౌకర్యాలు, అన్ని హంగులతో కూడిన సీఎంసీ భవన సముదాయాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం వేగవంతం కావడంతో పాటు, పౌర సేవలు మరింత సమర్థవంతంగా అందేలా ఈ భవనం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. నిర్మాణ పనులకు సంబంధించి అధికారులకు పలు సూచనలు, సలహాలు అందించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో సుమారు రూ. 2,000 కోట్ల విలువైన అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

**ప్రధాన అభివృద్ధి పనులు:**

రూ. 530 కోట్లతో మియాపూర్ చౌరస్తా ఫ్లైఓవర్ నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన.
10 ఎకరాల్లో రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం.
రూ. 459 కోట్లతో గచ్చిబౌలి ఐఐటీ జంక్షన్ ఫ్లైఓవర్ పనులు కొనసాగింపు.
రూ. 220 కోట్లతో కాజాగూడ జంక్షన్ ఫ్లైఓవర్ నిర్మాణం.
రూ. 308 కోట్ల అంచనా వ్యయంతో లింగంపల్లి ఆర్ఓబీ ఫ్లైఓవర్ పనులు త్వరలో ప్రారంభం.
రూ. 100 కోట్లతో కొండాపూర్, చందానగర్ ప్రాంతాల్లో కోర్ అర్బన్ పాఠశాలలకు ఇప్పటికే శంకుస్థాపన.

అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, శేరిలింగంపల్లిలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తూ ఆరోగ్యకరమైన, ప్రశాంతమైన వాతావరణాన్ని నెలకొల్పడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ శ్రీకాంతిని, డీఈ రూపదేవి, డీఈ దుర్గాప్రసాద్, హెచ్ఐసీటీఐ ప్రాజెక్ట్స్ డీఈ వరుణ్, ఏఈ శ్రీనాథ్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ సురేందర్, టీపీఎస్ శ్రీనాథ్, సీఐ కృష్ణమోహన్, ఆర్ఐ శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన గ్రామ సభలను విజయవంతం చేయాలి.

## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట జూన్ 3 మనసాక్షి**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించనున్న గ్రామ, వార్డు సభలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. జూన్ 4, 6, 8, 10 తేదీలలో నిర్వహించనున్న గ్రామ, వార్డు సభల ఏర్పాట్లపై బుధవారం జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో వెబెక్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి వీటిని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలో వర్షాకాల ముందస్తు చర్యలు, శానిటేషన్, త్రాగునీరు, ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) తదితర అంశాలపై అధికారులతో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని రైతు వేదికల్లో తప్పనిసరిగా గ్రామ సభలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ సభలకు మండల స్థాయి అధికారులు అందరూ విధిగా హాజరుకావాలని, ఇందుకు సంబంధించిన సిబ్బంది వివరాలను తక్షణమే సమర్పించాలని ఆదేశించారు. ఎండాకాలం తీవ్రత దృష్ట్యా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, గ్రామ సభలను ఉదయమే నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సభలు జరిగే చోట తాగునీరు వంటి అన్ని కనీస మౌలిక వసతులు కల్పించాలని, షెడ్యూల్ వివరాలను గ్రామాల్లో ముందే చాటింపు వేయించి ప్రజలకు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

**ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన :**

ఈ వర్షాకాలంలో జిల్లాలో సాధారణం కంటే కొంత తక్కువ వర్షపాతం నమోదయ్యే ఆస్కారం ఉందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం ఎక్కువగా పండుతుందని, అయితే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రైతులను క్రాప్ డైవర్షన్ వైపు ప్రోత్సహించాలన్నారు. తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు గ్రామ సభల్లో పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు.

**ఓటరు జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ :**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై క్షేత్రస్థాయిలో ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జూన్ 25 నుండి జూలై 24 వరకు బీఎల్ఓలు ప్రతి ఇంటికీ తిరిగి ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలిస్తారని తెలిపారు.

జూలై 31న ఓటరు ముసాయిదా (డ్రాఫ్ట్) జాబితా ప్రచురణ జరుగుతుందని, అనంతరం అభ్యంతరాల స్వీకరణ, నోటీసుల జారీ ఉంటుందని వివరించారు.

అక్టోబర్ 1వ తేదీన ఓటర్ల తుది జాబితాను (ఫైనల్ పబ్లికేషన్) విడుదల చేస్తారని పేర్కొన్నారు. 2002 నాటి జాబితా ప్రకారం కొత్త ఇంటెన్సివ్ జాబితాను తయారు చేయడం జరుగుతుందన్నారు. జాబితాలో ఉన్న ప్రతి ఓటరు వివరాలను ఎలిమినేషన్ ఫామ్‌లో నమోదు చేసి, నిర్ధారించుకుని బీఎల్ఓలకు అందించాలన్నారు. 2002 ఓటరు జాబితాలో పేరు లేని వారు తమ తల్లిదండ్రుల వివరాలను ఫామ్‌లో నమోదు చేయాల్సి ఉంటుందని, ఒకవేళ తల్లిదండ్రుల పేరు కూడా లేకపోతే ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం డాక్యుమెంట్లను సమర్పించాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

**వర్షాకాల ముందస్తు చర్యలు చేపట్టాలి :**

వర్షాకాలం ముంచుకొస్తున్న నేపథ్యంలో గ్రామస్థాయిలో వరదలకు గురయ్యే లోతట్టు ప్రాంతాలను ముందే గుర్తించి నివేదికలు సిద్ధం చేయాలన్నారు. వర్షాల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున గ్రామాల్లో శానిటేషన్ పనులు ముమ్మరం చేయాలని, ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేయాలన్నారు. తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని, మ్యాజిక్ సోక్ పిట్స్, జల సంరక్షణ, వన సంరక్షణ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

**బడి బాటపై ప్రత్యేక చర్చ నిర్వహించాలి**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచేందుకు చేపట్టిన 'బడి బాట'

కార్యక్రమంపై గ్రామ సభల్లో ప్రత్యేకంగా చర్చించాలని కలెక్టర్ సూచించారు. గ్రామాల్లోని పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించేలా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు చొరవ చూపి తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి హరి సింగ్, జడ్పీ సీఈఓ శిరీష, డిఆర్డిఓ సన్యాసయ్య, డిపిఓ యాదగిరి, ఇఇ మిషన్ భగీరథ అరుణాకర్ రెడ్డి, డిఇఓ అశోక్, డిఐఇఓ సులోచన, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## టిపిసిసి ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బొల్లె సైదులు మాదిగ

**సూర్యాపేట జూన్ 3 మనసాక్షి**



జిల్లా కేంద్రానికి చెందిన బొల్లె సైదులు మాదిగకు టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియామకమయ్యారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జూన్ 1న హైదరాబాదులో జరిగిన సమావేశంలో టిపిసిసి ఎస్సీ సెల్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నట్లు ఆయన తెలిపారు. ఎస్సీ సెల్ విభాగంతో పాటు కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ట కోసం కృషి చేసినందుకు తనకు ఈ పదవి లభించిందన్నారు. దళితుల కోసం అనేక పోరాటాలు చేయడంతో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేసినందుకు గతంలో దళిత రత్న అవార్డు కూడా అందుకున్నట్లు ఆయన తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. 40 ఏళ్ల ఎమ్మార్పీఎస్ పోరాటంలో ఏబిసిడిల వర్గీకరణ చేపట్టిన సీఎం రేవంత్ రెడ్డికి మాదిగలు కృతజ్ఞతా భావంతో ఉంటారని పేర్కొన్నారు.తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్ రెడ్డికి, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కు,టి పి సి సి ఎస్సీ సెల్ చైర్మన్ కవ్వం పల్లి సత్యనారాయణకు,తెలంగాణ టూరిజం అభివృద్ధి కమిటీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సైదులుకు పలువురు శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సన్మానించారు.

## ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

**చింతపల్లి.జూన్ 2 మన సాక్షి..**



శంకర నేత్రాలయ వారి సౌజన్యంతో, ఎం వి ఆర్ ఫౌండేషన్ మునుకుంట్ల వెంకట్ రెడ్డి, మునుకుంట్ల విద్యావతి మునుకుంట్ల తిరుమల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ,ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ లు ముఖ్యఅతిథిగా హాజరై బుధవారం దేవరకొండ మండలం పరిధిలోని కొండ భీమనపల్లి గ్రామంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత కంటి వైద్య శిబిరం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని నిరుపేదలు అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలన్నారు.ఈ శిబిరంలో కంటి పరీక్షలతో పాటు అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు సైతం 10 రోజుల పాటు నిర్వహించడం అభినందనీయమని వారన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కంటి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని వారు పిలుపునిచ్చారు. ముఖ్యంగా వృద్ధులు, కంటి సమస్యలతో బాధపడుతున్న వారు తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.నిరుపేద ప్రజల ఆరోగ్యం కోసం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎన్ వి ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులను అభినందించారు.ఈ కార్యక్రమంలో దేవరకొండ ఆర్డీఓ, దేవరకొండ మాజీ మున్సిపల్ చైర్మన్ వడ్త్యా దేవేందర్ నాయక్ , సిపిఐ జిల్లా కార్యదర్శి పల్ల నరసింహారెడ్డి,, పి ఎస్ సి ఎస్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, స్థానిక సర్పంచ్ గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు .

## వారసంతలో మూగజీవులకు త్రాగునీరు లేదు

### వినియోగదారులకు ఇక్కట్లు.

**తుంగతుర్తి, మన సాక్షి జూన్ 3.**



తుంగతుర్తి నియోజకవర్గం పరిధిలోని తిరుమలగిరి వారసంత లో ప్రతి బుధవారం సంతలో మౌలిక వసతులు కల్పించాల నీ జిఎం పిఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు కడెం లింగయ్య తిరుమలగిరిలో జరిగే అంగట్లో గొర్రెలకు మేకలకు నీటి వసతు కల్పించాలి వాటితో పాటు చిరు వ్యాపారులందరికి చలువ పందిర్లు వేసి నీడ వసతు కల్పించాలి తిరుమలగిరి మున్సిపల్ కు సంవత్సరానికి సుమారు పది నుండి 15 లక్షల రూపాయల ఆదాయం వస్తుంది అంగడి ద్వారా ఆదాయం వస్తున్నప్పటికీఅంగడిలో కనీస మౌలిక వసతులు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు ముఖ్యంగా మూగజీవాలకు నీళ్లు నీడవసతు లేదు ఎండలో మాడిపోతున్నారే తప్ప మంచి నీటి వసతులు లేక జీవాలు కాపరులు ఇబ్బంది పడతా ఉన్నారు అదే విధంగా పండ్లు కూరగాయలు వివిధ రకాల చిరు వ్యాపారులు ఎర్రటి ఎండలో మాడిపోతున్నారే తప్ప కనీస నీడ వసత్తు కల్పించలేని పరిస్థితి మున్సిపల్ కేంద్రంలో ఉన్నది తిరుమలగిరికి పెట్టుబడి లేని ఆదాయం అంటే అది అంగడి అంగడి కాంట్రాక్టర్దారులు మరియు మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి చిరు వ్యాపారులు అందరికీ సంతకు వచ్చే ప్రజలందరికీ మంచినీటి వసతు కల్పించాలి అంగట్లో మొత్తం చలవ పందిర్లు . వేయించాలి మూగజీవాలకు నీటి తొట్లు ఏర్పాటు చేయాలి కానీ మున్సిపల్ అధికారులు అంగడి ఆదాయం మాత్రమే లెక్కిస్తున్నారు తప్ప అంగట్లోకి వచ్చే ప్రజల బాగోగులు పట్టించుకోవడం లేదు సంతకు హద్దులు లేవు హద్దులు లేకపోవడం వల్ల ఆ కాంట్రాక్టర్ దారులు తొర్రూర్ రోడ్డు మోత్కూర్ రోడ్డు సూర్యాపేట రోడ్డు జనగామ రోడ్డు నాలుగు కూడలిలో విచ్చలవిడిగా డబ్బులు వసూలు చేస్తున్నారు సంతకు హద్దులు ఎక్కడ వరకు అక్కడ మాత్రమే డబ్బులు వసూలు చేయాలి ఋుతప్ప వారి ఇష్టం వచ్చినట్టు రోడ్ల వెంట డబ్బులు వసూలు చేయవద్దు దీనికంతటికి కారణం మున్సిపల్ అధికారులు సంతకు హద్దులు నిర్ణయించకపోవటమే జిఎంపిఎస్ గా మేము మున్సిపల్ కమిషనర్ కు విన్నపిస్తున్నాం తిరుమలగిరి సంతలో గొర్లకు మేకలకు పశువులకు మంచిది కల్పించాలి నీటి తొట్లు ఏర్పాటు చేయాలి సంతలోకొచ్చే సిరియాపారులకు ప్రజలకు సర్వ పండ్లు వేయిం లి వాటితో పాటు నీటి వసతు కల్పించాలి వీటన్నిటినీ తక్షణమే సంబంధిత అధికారులు ఏర్పాటు చేయకపోతే జి ఎం పి ఎస్ ఆధ్వర్యంలో సంతలోకొస్తే గొర్ల మేకల పెంపకదార సంఘం ఆధ్వర్యంలో రాధారులు కట్టనిమోము రహదారిపై డబ్బులు వసూలు చేయనీయము అందుకని తక్షణమే అంగట్లో ప్రజలందరికీ మౌనిక వసతులు కల్పించాలని జి.ఎం.పి.ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు కడెం లింగయ్య ప్రభుత్వాన్ని కోరారు ఈ కార్యక్రమంలో మర్యాద రామలింగయ్య యాదగిరి కొండ నరసయ్య లింగయ్య సత్తయ్య తదితరులు పాల్గొన్నారు

## తుంగతుర్తిలో ఏసీబీ సోదాలు.

### అడిషనల్ ఎస్పీ భుజంగరావు మామ రాజేశ్వరరావు ఇంటిలో సోదాలు .

**తుంగతుర్తి మన సాక్షి జూన్ 3.**



తుంగతుర్తి మండల పరిధిలోని అడిషనల్ ఎస్పీ భూగంగరావు మామ తుంగతుర్తి మండలానికి చెందిన దుద్యాల రాజేశ్వరరావు ఇంటిని ఏసీబీ అధికారులు ఉదయం 9 గంటల ప్రాంతంలో తనిఖీ చేశారు. ఇంట్లో వారెవరు లేకపోవడం ఇంటికి తాళాలు వేయడంతో వెనుతిరిగి వెళుతున్నట్లుగా ఏసీబీ అధికారి తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాదులో ఇటీవల ఫోన్ ట్రాఫిక్ కేసులో ప్రధాన నిందితులైన అడిషనల్ ఎస్పీ భుజంగరావు అక్రమ ఆస్తులు, సస్పెన్షన్ లో ఉన్న అడిషనల్ ఎస్పీ భుజంగరావు రాష్ట్ర ఏసీబీ రైట్స్ అధికారుల ఆదేశాల మేరకు మామ రిటైర్డ్ పోలీస్ అధికారి దుగ్యాల రాజేశ్వరరావు ఇంట్లో తనిఖీలు చేయడానికి రాగా వారు ఎవరూ లేక తాళాలు వేసి ఉండడంతో వెనుతిరిగి వెళుతున్నామని ఏసీబీ అధికారులు తెలిపారు. మరల మరొకసారి వీరి ఆస్తులను తనిఖీ చేయడం జరుగుతుందన్నారు.

## స్టేట్ ఫైనాన్స్ కమిషన్ గా సంకేపల్లి సుధీర్ రెడ్డి పదవీకాలం గొడగింపు.

**తుంగతుర్తి మన సాక్షి జూన్ 3.**



తుంగతుర్తి నియోజకవర్గం పరిధిలోని తిరుమలగిరి మండలానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సంఖపెల్లి. సుధీర్ రెడ్డి అతని నివాసంలో మాట్లాడుతూ నేను తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ ఫైనాన్స్ కమిషన్ గా మరొక రెండు సంవత్సరాలు పొడిగించిన శుభ సందర్భంగా తుంగతుర్తి నియోజకవర్గం లోని పలు మండలాల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుల తరపున ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డికి పలువురు మంత్రులకు కృతజ్ఞతలు తెలియపరిచారు. అదేవిధంగా పలు మండలాల్లోనే సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అతని నివాసంలో ఘనంగా శాలువాలతో స్వీటీలతో సన్మానించారు శుభాకాంక్షలు తెలిపారు. నాకు కాంగ్రెస్ పార్టీలో రెండవ సంవత్సరం నుండి పనిచేస్తూ మా ప్రాంత అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియపరుస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నూతన కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజా ప్రభుత్వంగా పేదల ప్రభుత్వంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేపడుతూ మహిళా సంఘాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ రాష్ట్రంలో ఆరు పథకాలను అమలుపరుస్తూ పేద ప్రజలకు అండదండగా నిలిచిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎల్లవేళలా ఉండే విధంగా మనమందరం ఐక్యంగా పార్టీ క్రమశిక్షణ పద్ధతులతో ఐక్యంగా ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు.

## సెంట్రల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ భానుతో భరత్ గౌడ్ భేటీ

**వెల్దండ జూన్ 3 మన సాక్షి:**



వెల్దండ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మట్ట భరత్ గౌడ్ అధ్యక్షుడు హైదరాబాదు నుండి అచ్చంపేట కు వెళ్తున్న క్రమంలో రంగారెడ్డి జిల్లా మైసిగండి దేవాలయంలో సెంట్రల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ భాను, స్టేట్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివకుమార్ రెడ్డి , అసెంబ్లీ అధ్యక్షుడు దళపతి లను కలిసి వెల్దండ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మట్ట భరత్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమం లో పట్టణ అధ్యక్షులు జంగిలి ఆనంద్ రాజ్, సమీర్, రంగారెడ్డి జిల్లా జర్నల్ సెక్రెటరీ రవికాంత్, అనిల్ లు కలిసి శాలువాలతో సన్మానించడం జరిగింది.

## తీదేడు గ్రామ కార్యదర్శిగా అశోక్ సేవలు అభినందనీయం



**చింతపల్లి. జూన్ 3 మనసాక్షి.**

తీదేడు గ్రామ అభివృద్ధి కోసం కార్యదర్శి భాదిని అశోక్ సేవలు అభినందనీయమని గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి అన్నారు.చింతపల్లి మండలం తీదేడు గ్రామ కార్యదర్శిగా గత 6 సంవత్సరాల 6 నెలల కాలం ఉత్తమ సేవలు అందించి బదిలీలో భాగంగా తక్కళ్లపల్లి గ్రామానికి కార్యదర్శిగా భాదిని అశోక్ బదిలీ కావడం జరిగిందని ఆమె తెలిపారు.తీదేడు గ్రామంలోని ప్రతి ఒక్కరితో స్నేహ పూర్వకంగా మెలుగుతు సేవలు అందించి అందరి మన్ననులు పొందడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ,ధరణిపతి రమణారావు, సోనగంటి గోవర్ధనాచారి, వార్డు సభ్యులు బొడ్డు పార్వతమ్మ యాదగిరి, మాదగోని కృష్ణ గౌడ్, గంటెల అలివేలు సోమయ్య,శివర్ల పర్వతాలు యాదవ్, గ్రామస్తులు మర్రు రామారావు,సిమర్ల శ్రీను యాదవ్,బొడ్డు ఆంజనేయులు,వీరమల్ల జగదీష్,మర్రు శ్రీనివాస రావు,మర్రు రంగారావు,దాసరి మల్లయ్య,గంటెల చంద్రయ్య,రాశిక పాండయ్య, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి ప్రభుత్వం కృషి



**చింతపల్లి. జూన్ 2 మన సాక్షి..**

ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి అన్నారు.బుధవారం చింతపల్లి మండలం తీదేడు ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడారు.అనంతరం ఆమె మాట్లాడుతూ....కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు.రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించడంతో పాటు విద్యా ప్రమాణాలను పెంపొందించే ఉక్కు సంకల్పంతో గత బిఆర్ఎస్ ప్రభుత్వం 'మన ఊరు-మన బడి' పథకాన్ని ప్రవేశపెట్టిందని ఆమె అన్నారు. నిరుపేద వర్గాలకు చెందిన విద్యార్థులు అభ్యసించే ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక సదుపాయాలు,డిజిటల్ తరగతులు ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన చేపట్టే విధంగా తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు 'మన ఊరు -మన బడి' కార్యక్రమాన్ని రూపొందించారని ఆమె తెలిపారు.పాఠశాలల పరిరక్షణలో గ్రామ ప్రజలు ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని కోరారు.రాష్ట్రం ఏర్పడిన తర్వాత విద్యా రంగంలో అనేక సానుకూల మార్పులు వచ్చాయని అన్నారు.ప్రతి విద్యార్థికి కార్పొరేట్‌కు దీటుగా సకల వసతులతో ఆంగ్ల మాధ్యమంలో బోధన అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బొడ్డు పార్వతమ్మ యాదగిరి,గంటెల అలివేలు సోమయ్య,రెడ్డి పద్మ పరమేష్, తీదేడు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్తయ్య, ఉపాధ్యాయులు, గ్రామస్తులు సిమర్ల శ్రీను యాదవ్,వీరమల్ల వెంకటయ్య,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 10లోపు పాఠశాలల మరమ్మతు పనులు పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్. బి చంద్రశేఖర్

నల్లగొండ జూన్ 3 మనసాక్షి.



విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అన్ని మరమ్మతు పనులను జూన్ 10లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.

బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మండల విద్యాశాఖ అధికారులు (ఎంఈఓలు), ఆర్‌సీఓలు, సంక్షేమ శాఖ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా కలెక్టర్**

బడిబాట కార్యక్రమం ఏర్పాట్లు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల వినియోగం, పాఠశాల భవనాల మరమ్మతులు, పాఠశాల బస్సుల ఫిట్‌నెస్, అంగన్‌వాడీ కేంద్రాల సౌకర్యాలు, కేజీబీవీలలో పెండింగ్ పనులు, విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ, సంక్షేమ హాస్టళ్ల మరమ్మతులు, పీఎం శ్రీ పాఠశాలల అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఫర్నిచర్ తదితర మౌలిక వసతులు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలను పూర్తిచేసి విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. పాఠశాలల్లో ప్రహరీ గోడల నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రాల్లో మూత్రశాలలు, తాగునీటి సౌకర్యాల కల్పన, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపడుతున్న పనులు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీల మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు యూనిఫాంలను అందజేయాలని, వాటి కుట్టు పనులను స్వయం సహాయక మహిళా సంఘాలకు అప్పగించాలని తెలిపారు.

సంక్షేమ హాస్టళ్లలో బియ్యం నిల్వలు, వంటశాలలు, మరుగుదొడ్లు, డైనింగ్ హాల్స్, తరగతి గదుల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా విద్యుత్, ప్లంబింగ్ వ్యవస్థలను పూర్తిగా తనిఖీ చేసి ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని చెప్పారు. పాఠశాలల పరిసరాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని సూచించారు. ప్రతి పాఠశాలలో లైబ్రరీలను ఏర్పాటు చేసి విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించాలని, జీరో అడ్మిషన్లు ఉన్న పాఠశాలల్లో ప్రత్యేక కార్యాచరణ చేపట్టి నమోదు సంఖ్య పెంచాలని అధికారులకు సూచించారు. జూన్ 12లోపు విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు అందించాలని ఆదేశించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులకు ఏఐ ఆధారిత తరగతులు నిర్వహించాలని,

పాఠశాలలలోనే ఆధార్ కార్డులు, కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీకి చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి విద్యార్థి తెలుగు, హిందీ, ఇంగ్లీష్ మూడు భాషల్లో ప్రావీణ్యం సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు.

తెలంగాణ పబ్లిక్ మోడల్ స్కూల్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కోరారు

రు . ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి దశరథ. స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ వై అశోక్ రెడ్డి. జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర రావు

జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి పిడి శేఖర్ రెడ్డి. సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

# ముగిసిన వేసవి కరాటే శిక్షణ

గుర్రంపోడు, జూన్ 03,మన సాక్షి :




గుర్రంపోడు మండలం కొప్పోలు,గ్రామంలో గురుదేవ హైస్కూల్లో షావోలిన్ షోటోఖాన్ స్పోర్ట్స్ కరాటే ఇండియా వారి వేసవి కరాటే శిక్షణ శిబిరం ముగింపు ఉత్సవం బుధవారం రోజున ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వైస్ ప్రిన్సిపల్ షేక్ మోయిన్ విద్యార్థినీ విద్యార్థులకు సమ్మర్ క్యాంప్ సర్టిఫికెట్ మరియు కలర్ బెల్ట్ సర్టిఫికెట్ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ స్కూల్ తరపున నిర్వహించిన వేసవి కరాటే శిక్షణ శిబిరం అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకొని విద్యలో మెలకువలు నేర్చుకున్నందుకుగాను సంతోషంగా ఉందని అంటూ విద్యార్థిని విద్యార్థులకు అభినందించారు. ప్రిన్సిపల్ మంచికంటి స్వప్న వేసవి కరాటే శిక్షణ శిబిరం విజయవంతంగా పూర్తి అయినందుకు గాను మాస్టర్ను అలాగే విద్యార్థినీ విద్యార్థులను అభినందించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన కరాటే విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకోగా, శిక్షణలో ప్రతిభ కనబరిచిన భైరవోని భరత్ మరియు బొడ్డు విక్రమ్ ఎల్లో బెల్ట్ సాధించారు. ఈ కార్యక్రమంలో భైరవోని లింగయ్య, బొడ్డు శ్రీను, కోట్రా నరేందర్, కొక్కు యాదగిరి, షేక్ గౌస్, తడిశెట్టి అనిల్ కుమార్ పాల్గొని విద్యార్థినీ విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. బ్లాక్ బెల్ట్ సెవెంత్ డాన్ ఇండియా చీఫ్ ఇన్స్ట్రక్టర్ ఇండియా సీనియర్ ఎగ్జామినర్ నాంపల్లి కనకారావు మాట్లాడుతూ ఈ వేసవి కరాటే శిక్షణ శిబిరం అవకాశాన్ని పిల్లలందరూ సద్వినియోగం చేసుకొని అతి తక్కువ సమయంలో మార్షల్ ఆర్ట్స్ విద్యలో ప్రావీణ్యం పొందడం ఎంతో సంతోషంగా ఉందని అంటూ విద్యార్థిని విద్యార్థులను అభినందించారు.

# టీ యు డబ్ల్యూ జె ఐ జె యూ గుర్రంపోడు మండల కార్యవర్గ ఎన్నిక

గుర్రంపోడు, జూన్ 3, మన సాక్షి :



నకిరేకల్ పట్టణంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ (టీ యూ డబ్ల్యు జె ఐ జె యూ) నల్గొండ జిల్లా మహాసభలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ మహాసభల సందర్భంగా జిల్లా కమిటీలతో పాటు గుర్రంపోడు మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గుర్రంపోడు మండల నూతన అధ్యక్షునిగా పిట్టలగూడెం గ్రామానికి చెందిన చింతరెడ్డి వెంకటేశ్వర రెడ్డి (సాక్షి దినపత్రిక) ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షునిగా కొప్పోలు గ్రామానికి చెందిన కొత్త నాగరాజు (ప్రజావాణి), కార్యదర్శిగా చామలేడు గ్రామానికి చెందిన దాము యాలాద్రి (మన సాక్షి), కోశాధికారిగా కొప్పోల్ గ్రామానికి చెందిన అయితరాజు నాగరాజు (ప్రజా ప్రతిభ) ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శిగా గుర్రంపోడు మండల కేంద్రానికి చెందిన పోలేపల్లి శేఖర్ (జనం సాక్షి), నిర్వహణ కార్యదర్శిగా పిట్టలగూడెం గ్రామానికి చెందిన పాలడుగు శ్రీధర్ (సూర్య) బాధ్యతలు చేపట్టారు. కార్యవర్గ సభ్యులుగా గుర్రంపోడు మండల కేంద్రానికి చెందిన రావుల వెంకటనారాయణ గౌడ్ (తెలంగాణ గళం), పాల్వాయి గ్రామానికి చెందిన బైరెడ్డి రమేష్ (మన తెలంగాణ), వెంకటాపురం విష్ణు (ప్రజా వాయిస్) ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన గుర్రంపోడు మండల కార్యవర్గ సభ్యులకు పలువురు పత్రికా విలేకరులు, స్థానిక నాయకులు అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు.

# టియుడబ్ల్యూజే(ఐజేయు) మండల నూతన కార్యవర్గం ఎన్నిక

మాడుగుల పల్లి జూన్ 3 మన సాక్షి




మాడుగులపల్లి మండలం జర్నలిజం రంగంలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. నకిరేకల్ పట్టణంలోని వినాయక బ్యాంక్వెట్ హాలులో జరిగిన టీయూడబ్ల్యూజే జిల్లా మహాసభలో మాడుగులపల్లి మండలం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.?ఈ ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర అధ్యక్షుడు వీరహత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామనారాయణ సమక్షంలో జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి ప్రకటించారు టీయూడబ్ల్యూజే (ఐజేయు)నూతన సారథులను అధికారికంగా ప్రకటించారు. మాడుగుల పల్లి అధ్యక్షుడు షేక్ రసూల్..ప్రధాన కార్యదర్శిగాదర్శనం రాంబాబు ?ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు ఎస్కే రసూ ల్ మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. ఐజేయు సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ, క్షేత్రస్థాయిలో విలేకరులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై నిరంతరం పోరాడతామని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా, కాలాతీతమవుతున్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని, యూనియన్ అండదండలతో ప్రతి జర్నలిస్టుకు భరోసా కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు.?ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు సీనియర్ జర్నలిస్టులు, సంఘం నాయకులు పాల్గొని నూతనంగా ఎన్నికైన వారికి అభినందనలు తెలియజేశారు.

# పేట జిల్లాలో భారీగా పోలీసుల బదిలీలు






సూర్యాపేట జూన్ 3 మనసాక్షి

జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వర్తిస్తున్న 77 మంది హెడ్ కానిస్టేబుళ్ల కు, 25 మంది కానిస్టేబుళ్లకు పారదర్శకంగా కౌన్సిలింగ్ నిర్వహించి బదిలీ ఉత్తర్వులు జారీచేసినట్లు జిల్లా ఎస్పి నరసింహ తెలిపారు. వివాదాలకు తావులేకుండా ఒత్తిడిని సమస్యలను అధిగమిస్తూ ప్రజలకు పోలీసు సేవలు అందించడంలో చట్ట పరిధిలో సమర్థవంతంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పి నరసింహ మాట్లాడుతూ కోరుకున్న చోటుకు పోస్టింగ్ ఇచ్చాం, అనుభవాన్ని ఉపయోగించి పోలీసు సేవలు అందించాలని దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ల నందు పని చేస్తూ సుదీర్ఘకాలం ప్రజలకు సేవలు అందించిన అనుభవం ఉన్నదని, కష్టమైన పరిస్థితుల్లో కూడా ఉద్యోగం నిర్వహించి ఈ స్థాయికి వచ్చారు అన్నారు, మీ యొక్క పూర్తిస్థాయి అనుభవాన్ని ఉపయోగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, పోలీస్ స్టేషన్లో స్టేషన్ హౌజ్ అధికారికి, జూనియర్స్ కు, తోటి సిబ్బందికి పనిలో కలుపుకుని కష్ట పడి పని చేస్తూ ఆదర్శంగా ఉండాలని తెలిపారు. కేసుల దర్యాప్తులో నైపుణ్యం, మెళకువలు చూపాలని , కొత్త చట్టాల ప్రకారం హెడ్ కానిస్టేబుల్ స్టేషన్ ఇంఛార్జి అధికారిగా పోలీస్ స్టేషన్ లో అన్ని విధులను, పనులను పర్యవేక్షణ చేయాలన్నారు. సమస్యలు, ఫిర్యాదులను పై అధికారుల దృష్టిలో పెట్టాలని అధికారులతో సమన్వయం కలిగి ఉండాలని అన్నారు. హెడ్ కానిస్టేబుల్ బాధ్యతగా ఉండకపోతే స్టేషన్ లో ఉన్న క్రింది స్థాయి సిబ్బంది పనిలో నైపుణ్యం సాధించలేరు అన్నారు. స్టేషన్ పరిధిలో జరిగే సాంఘిక కార్యకలాపాలు గుర్తించి నిరోధించడంలో కృషి చేయాలని సూచించారు. మంచి ఆహార అలవాట్లు కలిగి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని , సమయం దొరికినప్పుడు వ్యాయామం చేయడం, యోగ చేయడం లాంటి చేయాలి అన్నారు. రోడ్డు ప్రయాణ సమయంలో

జాగ్రత్తగా ఉండాలని సూచించారు, విధులు నిర్వర్తించే చోటే నివాసం ఉండాలని అన్నారు.

సామాజిక అంశాలు రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాల నిర్మూలన, సైబర్ మోసాలు, డ్రగ్స్ గంజాయి నిర్మూలన, అసాంఘిక చర్యల నిర్మూలన పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. చట్టప్రకారం పని చేయండి. నేరాలు, తప్పులు చేసేవారి పట్ల, ప్రజలను ఇబ్బంది పెట్టే వారి పట్ల. ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దు అన్నారు.

ఈ కార్యక్రమం లో అడ్మినిస్ట్రేషన్

అధికారి మంజు భార్గవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, పోలీస్ సంఘం అధ్యక్షులు ఎస్ఐ రామచందర్ గౌడ్, సెక్షన్ సూపరింటెండెంట్ సబితా రాణీ, సీసీ సందీప్, సిబ్బంది ఉన్నారు.

# గొర్రెల కాపరి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుంది

చింతపల్లి. జూన్ 3 మన సాక్షి.





డిండి మండలం బ్రాహ్మణపల్లి గ్రామ శివారులో జరిగిన విషాదకర ఘటనలో నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రానికి చెందిన "గొర్ల కాపరి ఎల్లయ్యతో పాటు 136 గొర్రెలు మృతి" చెందడం చాలా బాధాకరమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. గురువారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటన విషయం తెలుసుకున్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ,ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య , గొర్రెలు, మేకల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ సరిత–తిరుపతయ్య కార్పొరేషన్ డైరెక్టర్ క్యామ మల్లేష్ ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితుల స్వస్థల ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు తో ఫోన్‌లో మాట్లాడి బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతుడు ఎల్లయ్య మృతదేహానికి నివాళులర్పించి, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తక్షణ సహాయంగా యాదవ సంఘం తరఫున రూ.1 లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అలాగే ప్రభుత్వం తరఫున బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ గారు మాట్లాడుతూ, గొర్ల కాపరులు తమ జీవనాధారమైనగొర్రెలకు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని, తద్వారా ఇలాంటి అనుకోని ఘటనలు జరిగినప్పుడు ఆర్థిక భద్రత లభిస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, యాదవ సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మిట్స్ లక్ష్మీ రాజ్యంకు కన్నీటి వీడ్కోలు

మదనపల్లి, జూన్ 3, మన సాక్షి :





మదనపల్లి దగ్గర ఉన్న మిట్స్ యూనివర్సిటీ చాన్స్ లర్ నాదెళ్ల విజయభాస్కర్ చౌదరి సతీమణి నాదెళ్ల రాజ్యలక్ష్మి అంత్యక్రియలు బుధవారం ఘనంగా నిర్వహించారు.

రెండు రోజుల క్రితం బెంగళూరులోని నివాసంలో ఆకస్మికంగా అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. బుధవారం ఆమె మృతదేహాన్ని బెంగళూరు నుంచి అంగళు లోని మిట్స్ యూనివర్సిటీ క్యాంపస్‌కు తీసుకువచ్చారు. అక్కడ ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఆమె భౌతికకాయాన్ని చివరిసారిగా చూసేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. విద్యార్థులు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు నివాళులర్పిస్తూ భావోద్వేగానికి గురయ్యారు. పలువురు ఆమెతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. లక్ష్మీ రాజ్యం మరణం కుటుంబానికే కాదు, మిట్స్ యూనివర్సిటీకి కూడా తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.

ఏళ్ల తరబడి జీవిత ప్రయాణంలో తోడుగా నడిచిన వ్యక్తి ఒక్కసారిగా దూరమైతే ఆ బాధను మాటల్లో చెప్పలేమని పేర్కొన్నారు. ఇంట్లో ప్రతి జ్ఞాపకం, ప్రతి సందర్భం ఆమెను గుర్తు చేస్తూనే ఉంటాయని, ఆ శూన్యాన్ని భర్తీ చేయడం ఎవరి వల్లా కాదని అన్నారు. అయినప్పటికీ జీవితాన్ని ధైర్యంగా ముందుకు తీసుకెళ్లడమే ఆమెకు ఇచ్చే నిజమైన నివాళి అని మిట్స్ యూనివర్సిటీ ఛాన్సలర్ నాదెండ్ల విజయభాస్కర్ చౌదరికి ధైర్యం చెప్పారు.

వేదన, బాధల మధ్య సాయంత్రం మిట్స్ యూనివర్సిటీ నుంచి రిషివ్యాలీ క్రాస్ సమీపంలోని మిట్స్ ఫామ్‌హౌస్ వరకు ప్రత్యేక వాహనంలో అంతిమ యాత్ర నిర్వహించారు. ఆ అంతిమ ప్రయాణం అక్కడి ప్రతి హృదయాన్ని కలచివేసింది. కదిలించింది. బాధతప్త హృదయాలతో లక్ష్మీ రాజ్యంకు తుది వీడ్కోలు పలికారు.

వైఎస్సార్‌సీపీ మదనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్, ప్రో ఛాన్సలర్ నాదెండ్ల ద్వారకనాథ్, మదనపల్లి టౌన్ బ్యాంక్ చైర్మన్ విద్యాసాగర్,

రాటకొండ బాబు రెడ్డి, శోభమ్మ, బీజేపీ నాయకులు చల్లపల్లి నరసింహారెడ్డి, సాయి లోకేష్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, దేశ విదేశాల నుంచి వచ్చిన శ్రేయోభిలాషులు, వివిధ ప్రాంతాల ప్రజలు నివాళులర్పించారు.

# సర్ పేరుతో ఓటర్ల జాబితా ప్రక్షాళనకు బీజేపీ కుట్ర






సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి.

**సూర్యాపేట జూన్ 3 మనసాక్షి**

రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రజలు కాపాడుకోవాలని, సర్ (ఓటర్ల జాబితా ప్రత్యేక ధ్రువీకరణ) పేరుతో మైనారిటీలు, దళితులు, ఆదివాసీల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి ఆరోపించారు. బుధ వారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని స్టార్ బ్యాంక్ ఎట్ హాల్ రెండు రోజులపాటు జరిగే సిపిఐ ( ఎం )పార్టీ సూర్యాపేట జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించి, మాట్లాడుతూధ్రువీకరణ పత్రాల లేమి కారణంగా పేద ప్రజలు ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఎన్నికల ప్రక్రియను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవాలని బీజేపీ చూస్తోందని విమర్శించారు. ప్రజలు ప్రభుత్వాలను ఎన్నుకునే ప్రజాస్వామ్య విధానానికి బదులుగా ప్రభుత్వమే ఓటర్లను ఎంపిక చేసే పరిస్థితికి దేశాన్ని నెట్టివేస్తోందన్నారు. బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య శక్తులన్నీ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తమ ఇష్టానుసారం పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను పెంచుతుందని ఆరోపించారు. ఇప్పటికే యుద్ధాల మూలంగా ప్రజలపై బారాలు పడి ఇబ్బంది పడుతున్న ప్రజలపై మునిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా ఇంధన ఆయిల్ ధరలు పెంచడం సమంజసం కాదన్నారు. ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల ముందు ఎలాంటి గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచమని చెప్పి రోజు విడిచి రోజు పెంచడంలో అర్థం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్న నేటికీ ఇచ్చిన హామీని అమలు చేయలేదని ఆరోపించారు. మహిళలకు 2500, వ్యవసాయ కార్మికులకు ఏడాదికి 12,000, గ్యాస్ సబ్సిడీ, నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు వంటి హామీలు అటకెక్కించారని విమర్శించారు.

రైతుల పొలాల్లో విద్యుత్ మీటర్ల ఏర్పాటు, విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే కేంద్ర ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం రైతు డిస్కంను తీసుకొచ్చిందన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతు డిస్కం ద్వారా రైతులు, పేద ప్రజలకు అందుతున్న విద్యుత్ సబ్సిడీలను ఎత్తివేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.

ఈ శిక్షణ తరగతుల ప్రారంభ సూచికంగా సిపిఎం పతాకాన్ని పార్టీ సీనియర్ నాయకులు బొమ్మిడి లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి ప్రిన్సిపాల్ గా వ్యవహరించిన ఈ శిక్షణ తరగతులలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ములకలపల్లి రాములు, మట్టి పెళ్లి సైదులు, కోట గోపి, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, మండల, పట్టణ శాఖ కార్యదర్శిలు, సిపిఎం మండల, పట్టణ కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.

# బారాస డిజిటల్ సభ్యత్వాన్ని విజయవంతం చేయాలి

. మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

**వెల్దండ జూన్ 03 మన సాక్షి:**



తెలంగాణ జాతిపిత మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పిలుపు మేరకు, కల్వకుర్తి నియోజకవర్గంలో ఎస్ఐ ఆర్ ప్రక్రియ మరియు బీఆర్ఎస్ పార్టీ డిజిటల్ మెంబర్షిప్ (సభ్యత్వ, నమోదు) డ్రైవ్ కార్యక్రమంపై బుధవారం అవగాహన సదస్సును మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 2026 జూన్ 04 గురువారం ఉ:10:00 గంటలకు తోడేటి చెన్నారెడ్డి గార్డెన్స్ లో జరగనున్న కార్యక్రమానికి కార్యకర్తలు, అభిమానులు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి,మెట్టు శ్రీనివాస్ పార్టీ సెక్రెటరీ మరియు నాగర్‌కర్నూల్ ఇంచార్జ్,వేద రజని కల్వకుర్తి సభ్యత్వ నమోదు ఇంచార్జ్ ముఖ్య అతిథులుగా విచ్చేయుచున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పుట్ట రాంరెడ్డి, కల్వకుర్తి మున్సిపాలిటీ సత్యం, నాయకులు కానుగుల జోగయ్య, జంగిలి నిరంజన్, జంగిలి యాదగిరి, జంగిలి ఆనంద్, ప్రవీణ్, మాజీ సర్పంచ్ అంజయ్య, మాజీ ఉపసర్పంచ్ మండల పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు వద్యావత్ రాజు నాయక్, గండికోట రాజు, నరసింహ, పకాడి జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్తున్న ఏ ఈ ఓ కు సన్మానం

**వెల్దండ జూన్ 03 మన సాక్షి:**



మండలంలోని ఉమ్మడి పోతేపల్లి గ్రామపంచాయతీలో వ్యవసాయ విస్తరణ అధికారిగా 8 సంవత్సరాలు సేవలందించి బదిలీపై వెళుతున్న ఏఈవో విజేతను వెల్దండ మాజీ జెడ్పిటిసి, పోతేపల్లి మాజీ సర్పంచ్ వావిళ్ళ వెంకటమ్మ బుధవారం ఘనంగా సన్మానించారు. వంగూర్ మండలం డిండి చింతపల్లి ఏఈఓ గా విధులు నిర్వహిస్తున్న కవిత పోతేపల్లి ఏఈఓ గా బాధ్యతలు చేపట్టారు. వారికి పోతేపల్లి కంటెస్టెడ్ సర్పంచ్ అభ్యర్థి సత్యనారాయణ యాదవ్ ,మాజీ సర్పంచ్ దువాసి సత్యనారాయణ శాలువతోసత్కరించారు. కార్యక్రమంలో కిరణ్ యాదవ్, తానేష్, ముంత వెంకటయ్య,కుమారి వెంకటయ్య,ఆంజనేయులు గౌడ్, కుమారి అల్లాజి,కె.వెంకటయ్య, దువాసి శ్రీనివాసులు ఉన్నారు.

# ప్రైవేటు వద్దు.. ప్రభుత్వ పాఠశాలలే ముద్దు






బడిబాట ప్రతిజ్ఞ చేయించిన సర్పంచ్ నాగిరెడ్డి.

**నారాయణపేట టౌన్, జూన్ 03 మనసాక్షి :-**

ప్రభుత్వ పాఠశాలలు ముద్దు ప్రైవేట్ పాఠశాలలు వద్దు అని నారాయణపేట మండ లం సింగారం సర్పంచ్ కే.నాగిరెడ్డి జాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాల ప్రధానోపాధ్యాయురాలు భారతి అన్నారు. బుధ వారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా జాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం సింగారం పర్యటించారు.. ఈ కార్యక్ర మంలో సింగారం గ్రామ పంచాయతీ లో గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి ఉప సర్పంచ్ లక్ష్మణ్ గ్రామసభ ఏర్పాటు చేసి గ్రామసభలో మాట్లాడుతూ విద్యార్థులను తప్పకుండా ప్రతి తల్లిదం డ్రులు ప్రభుత్వ పాఠశాలకు పంపాలని,పిల్లలు చదివితే ఎంతో ఉన్నత స్థానానికి ఎదుగుతారని అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్ లో విశాలమైనటువంటి గదులు అన్ని వసతులు తో ఉన్నా యని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పిస్తే ప్రతి విద్యార్థికి రెండు జతల దుస్తులు, పాలు రాగిజావ, రుచికరమైనటువంటి మధ్యాహ్న భోజనము, ఉచిత పాఠ్యపుస్తకాలు,నోట్ బుక్స్ ప్రభుత్వ పాఠశాలలో అందిస్తారన్నారు. నేడు ప్రైవే ట్ పాఠశాల కంటే ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు ఉంటాయని ప్రతి తల్లిదండ్రు లు తప్పకుండా తమ పిల్లల ను పంపి ఈ అవకాశాలు

సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామ సభలో సర్పంచ్ నాగిరెడ్డి బడిబాట ప్రతిజ్ఞను విద్యార్థు ల తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ప్రధానో పాధ్యాయులు భారతి మాట్లాడుతూ మా పాఠ శాలలో శిక్షణ పొందిన

టువంటి ఉపాధ్యాయులు ఉన్నారని,ఈ పాఠశాలలో రోబెటిక్ శిక్షణ సైన్స్ ల్యాబ్ కరాటే ప్రతి విద్యార్థి పైన ప్రత్యేకమైన శ్రద్ధ వహించి వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. మీ పిల్లలు మా ప్రభుత్వ పాఠశాలలో చేర్పిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మప్ప, సింగారం ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయప్రకాష్ నాయక్, ఉపాధ్యాయులు భీమప్ప,దత్తాత్రేయ, భాస్కర్, సాయప్ప, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ప్రతాప్ ,మధుసూదన్ ,భాను ప్రకాష్, లక్ష్మణ్ ,నరసింహ, నర్సింలు ,రఘురాంరెడ్డి, నిర్మల,శశిరేఖ,శ్రీదేవి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

# పిలుట్లలో బడిబాట

**శివంపేట జూన్ 3 మన సాక్షి**




శివంపేట మండలంలోని పిలుట్ల గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ బుర్ర మురళి గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు గ్రామంలో అన్ని వాడాల్లోనూ ర్యాలీ నిర్వహించి అక్షరాస్యత పైన అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఆశ వర్క కార్యకర్తలు మహిళలు రైతులకు తదితరులు పాల్గొన్నారు

# ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరం

**నారాయణపేట టౌన్, జూన్ 03 మనసాక్షి :-**



ప్రతి ఒక్కరికి ఆత్మరక్షణ కోసం కరాటే ఎంతో అవసరం అని బిజెపి రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ అన్నారు. బుధవారం కేశవ్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఎస్సార్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కరాటేలా శిక్షణ పొందిన విద్యార్థులకు బెల్ట్ లు సర్టిఫి కెట్స్ పంపిణీ చేశారు. ముందుగా బ్లాక్ బెల్ట్ సాధించిన స్రవంతి, భావేష్,నాయుడు, యం.అఖిల్, శివ శంకర్, అభిరామ్, లావణ్య, రిత్విక్.అర్జున్ లకు బ్లాక్ బెల్ట్ లు సర్టిఫికెట్ లను అందించారు. అనంతరం నామాజీ మాట్లాడుతు మాట్లాడుతూ విద్యార్థులందరూ కన్న తల్లిదండ్రుల పట్ల గౌరవంతో ఉండాలని. గురువులను పూజించాలని,సమాజం పట్ల ఎంతో బాధ్యతతో మెలగాలని సమాజంలో ఒకరికొకరు స్నేహభావంతో నడుచుకోవాలని సూచించా రు. మాస్టర్ అశోక్ కు మీ కరాటే అకాడమీ నుండి విద్యార్థులకు కరాటే లో శిక్షణ ఇచ్చి సమాజానికి అందించాలని అన్నారు. ఇప్పుడు చదువు నేర్చుకుంటు న్న విద్యార్థులదరు ప్రతి ఒక్కరు విధిగా ప్రతి రోజు యోగ, రన్నింగ్, కసరత్తులు చేయాలని ఈ ఆధునిక కాలంలో ముఖ్యంగా మహిళ లకు కరాటేలో శిక్షణ తప్ప కుండా పొందాలని అప్పుడే మీరందరూ ఆపద సమయంలో మిమ్మల్ని మీరు రక్షించుకునే వారు అవు తారనిఅన్నారు. క్రమ శిక్షణ కలిగిన విద్యార్థులు రేపటి భావిభారత పౌరులుగా మెలుగుతారు అని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సత్య రఘుపాల్ రెడ్డి. రవి కుమార్ గౌడ్, మాస్టర్ అను రాధ, షి టీమ్ పోలీస్ అధి కారి బాల్ రాజు. రాకేష్ మాస్టర్. పేరెంట్ అశోక్, విద్యార్థులు,నర్సింహఅమూల్య,ముకుందా,హరిప్రియ,రాకేష్. ఆనంద్,బృందా,అభిలాష్, మహేశ్వరి,సాత్విక్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

# బేసరత్తుగా పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి.

టిపిసిసి నాయకులు అడ్వకేట్ యుగంధర్ వెల్లడి.

**తుంగతుర్తి మనసాక్షి జూన్ 3.**



తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని శాలిగౌరారం మండ వానికి చెందిన టిపిసిసి నాయకులు పర్యపాటి యుగంధర్ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుండి ఆంధ్రావాళ్లు తెలంగాణపై పెత్తనం జలా ఇస్తూ అధిక నిధులను దోచుకుని ఆ రాష్ట్రాన్ని బాగు చేసుకున్నారు తప్ప మన తెలంగాణ ప్రాంతాన్ని ఎడారిగా చేసిన ఆంధ్ర వాళ్లకు తెలంగాణ పై మాట్లాడే హక్కు లేదని హెచ్చరించారు. అందరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఉన్నప్పుడు కలిసిమెలిసి ఉన్నాము కానీ ఇయ్యాల కాళ్లలో కట్టే పెట్టే విధంగా మీరు మాట్లాడటం బాగాలేదని గతంలో సినిమాలు తీశారు రాజకీయాలు తెలియకుండా మాట్లాడటం అవివేకం అన్నారు. ఏదో కొన్ని సంవత్సరాల నుండి కొన్ని రాజకీయ పార్టీలతో పొత్తు పెట్టుకుని ఈరోజు ఓ ముఖ్యమంత్రి కాగానే మీ మాటలు విని తెలంగాణలో అంత మూర్ఖులు ఎవరు లేరని తెలంగాణ ప్రజలు చాలా తెలివిగల వారిని ఇప్పుడు మీ ఆటలు ఇక్కడ నడవమని ఆయన మాట్లాడే విధానం మార్చుకోవాలని గౌరవంగా మీ ఆంధ్రప్రదేశ్లో ఏం చేస్తారో చేసుకోరి కానీ మా తెలంగాణలో మీకు పదవులు లేవు పార్టీ లేదు మీరు అనుషిత వ్యాఖ్యలు తెలంగాణ వాళ్లపై మాట్లాడటం సరికాదని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో మీరు ఇక్కడ పార్టీ పెట్టుకున్న మీకు వచ్చే సీట్లు ఓట్లు ఏమీ లేవని డబ్బులు బాగా దండుకొని గతంలో హైదరాబాదులో ఆ డబ్బుతో దొంగ భూములు కొనుక్కొని చెరువులు కుంటలను మలుపుకొని ఈరోజు నీ ఆస్తులు ఎంత ఆరోజు నీవు నిలబడ్డప్పుడు నీ అఫ్డేట్ లో ఎంత ఉన్నది మాకు తెలుసు నీవు ఏదో కలవాలి మాటలతో తెలంగాణ ప్రజలను మోసం చేయాలని చూస్తున్నావు తప్ప నీవు ఏమి చేయలేవు గతంలో నమ్ముకొని గోసపోయాము మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ ఉద్యమం చేసి తెలంగాణకు మోసం చేసిన ప్రతి ఒక్క వ్యవస్థలో దోచుకొని దాచుకున్నారు వాళ్లు ఈరోజు వాళ్ళ కుటుంబ సభ్యులే తెలంగాణను దోచుకున్నారు కావున వాళ్లను తరిమికొట్టారు తెలంగాణ ప్రజలు ఓటుతోని ఎవరికి బుద్ధి చెప్పాలో బాగా తెలుసునని దుయ్యబట్టారు. మీరు ఆంధ్రలో పుట్టి ఆంధ్రను బాగు చేసుకోవడానికి చేతకాక తెలంగాణపై కాపాడ ప్రేమ చూపించడం సరికాదన్నారు.

# కళ్యాణ లక్ష్మి కొండంత ఆసరా

**గుర్రంపోడు, జూన్ 03, మన సాక్షి :**



గుర్రంపోడు మండల కేంద్రంలో బుధవారం అర్హులైన పేద కుటుంబాల ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పిస్తూ కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఘనంగా పంపిణీ చేశారు. మండల తహసిల్దార్ కరుణ శ్రీ చేతుల మీదుగా మొత్తం 44 మంది లబ్ధిదారులకు రూ. 44,05,104 విలువ గల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ కరుణ శ్రీ మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాల్లోని ఆడబిడ్డల పెళ్లిళ్లు అప్పుల భారం కాకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని తెలిపారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని, లబ్ధిదారులు ఈ నిధులను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. లబ్ధిదారుల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా రెవెన్యూ యంత్రాంగం నిరంతరం పనిచేస్తోందని తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమంలో ఎస్సీ సెల్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మేడి వెంకన్న, సీనియర్ నాయకులు కమతం జగదీశ్వర్ రెడ్డి, కన్నెబోయిన సత్తయ్యలతో పాటు పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు మరియు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జనగణన సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట జూన్ 3 మనసాక్షి**



జనగణన--2027 సర్వే దేశాభివృద్ధికి కీలకమైన ప్రక్రియ అని, ప్రజలందరూ ఎనిమరేటర్లకు సహకరించి తమ వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ పిలుపునిచ్చారు. ఇంటింటికి వచ్చే సర్వే సిబ్బందికి సరైన సమాచారం అందించి జనగణన విజయవంతం కావడానికి తోడ్పడాలని సూచించారు.

జనగణన--2027 సర్వేలో భాగంగా బుధవారం అధికారులు కలెక్టరేట్ కార్యాలయానికి వెళ్లి జిల్లా కలెక్టర్ నమోదు చేసిన వివరాలను వెరైఫికేషన్ పూర్తి చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన ద్వారా సేకరించే గణాంకాలు ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాల రూపకల్పనకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజలు ఎలాంటి అపోహలకు తావివ్వకుండా సర్వేలో పాల్గొని ఖచ్చితమైన వివరాలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

# సేంద్రియ సాగుతో రైతులకు ఎంతో ప్రయోజనం

**శివంపేట జూన్ 3 మన సాక్షి**



సేంద్రియ ఎరువులతో రైతులకు ఎంతో ప్ర యో జ క రం గా ఉంటుందని మండల సహకార సంఘం చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి అన్నారు మండల కేంద్రమైన శివంపేట సహకార సంఘం కార్యాలయంలో జిలుగు విత్తనాలు రైతులకు 50 శాతం సబ్సిడీ పైన పంపిణీ చేశారు రైతులు రైతులు సేంద్రియ ఎరువులతోని ఎక్కువ ప్రయోజనాలు ఉన్నాయి అన్న విషయాన్ని రైతులు అవగాహన చేసుకుని రైతు రైతులు లాభాల పాఠాలు నడవాలవలసిన అవసరం ఉన్నదని మండల సహకార సంఘం చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి చెప్పారు ఈ కార్యక్రమంలో మండల సహకార సంఘం ఉపాధ్యక్షులు నాయిని వేణుగోపాల్ రెడ్డి సహకార సంఘం సీఈవో మధు యాదవ్ డైరెక్టర్ పెంటా గౌడ్ డైరెక్టర్లు రైతులు తదితరులు ఉన్నారు

# సెంట్రింగ్ మేస్త్రీల డిమాండ్లకు మాస్ లైన్ మద్దతు.

నారాయణపేట టౌన్, జూన్ 03 మనసాక్షి :-




నారాయణపేట జిల్లా కేంద్రంలో సెంట్రింగ్ మేస్త్రీల సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వ హించిన సమ్మెకు సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకులు ఎం. కాళేశ్వర్, కె. కాశీనాథ్ పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమానికి సెంట్రింగ్ మేస్త్రీల సంఘం అధ్యక్షులు డి. బాబు అధ్య క్షత వహించారు.ఈ సంద ర్భంగా నాయకులు మాట్లా డుతూ, నిర్మాణ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న సెంట్రింగ్ మేస్త్రీలు, కార్మికు లు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నిర్మాణ సామగ్రి ధరలు, జీవన వ్యయం రోజు రోజుకూ పెరుగుతున్నప్పటికీ కార్మికుల కూలి రేట్లు అందు కు అనుగుణంగా పెరగక పోవడం వల్ల వారి కుటుం బాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల ను ఎదుర్కొంటున్నాయని అన్నారు. సెంట్రింగ్ మేస్త్రీల సంఘం ప్రకటించిన కొత్త రేట్లను నిర్మాణ యజమానులు, కాంట్రాక్టర్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల శ్రమకు తగిన గౌర వం, న్యాయమైన వేతనం కల్పించాల్సిన బాధ్యత యజమానులపై ఉందన్నా రు. కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే చర్చలు జరిపి పరిష్కరిం చాలని కోరారు.కార్మికుల హక్కుల కోసం జరుగుతున్న ఈ సమ్మె న్యాయమైనదని, వారి డిమాండ్లు నెరవేరే వరకు సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ అండగా నిలు స్తుందని తెలిపారు. కార్మికుల ఐక్యత ద్వారానే హక్కులు సాధించుకోవచ్చని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో సెంట్రింగ్ మేస్త్రీల సంఘం అధ్యక్షుడు డి బాబు, ఉపాధ్యక్షుడు కే లక్ష్మణ్ , గౌరవ అధ్యక్షుడు దండు ఉషణ్ణ, కార్యదర్శి బండి నరసింహ, కోశాధికారి నరేష్ , కార్యదర్శి కే లక్ష్మణ్ , గౌరవ ఉపాధ్య క్షుడు మల్లప్ప తో పాటు సభ్యులు, సెంట్రింగ్ మేస్త్రీలు,నిర్మాణ రంగ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమానికి మద్దతుగా సిపిఎం జిల్లా కార్యదర్శి వెంకటరామిరెడ్డి, మడివాల కృష్ణ మద్దతు తెలిపారు.

# నంద్యా నాయక్ తండా పంచాయతీ కార్యదర్శి గా శివకుమార్.

కొడంగల్ మే 03 మన సాక్షి.



కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలం పరిధిలోగల నంద్యా నాయక్ తండా గ్రామపంచాయతీ కార్యదర్శిగా శివకుమార్ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన వినయ్ కుమార్ బండి అడిగిచెర్లకు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో బాధ్యతలు స్వీకరించారు . ఈ సందర్భంగా ఆయన శివకుమార్ మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తానని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అరులైన ప్రతి ఒక్కరికి అందేలా చూస్తానని, గ్రామ పంచాయితీలో అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

# ఖబర్దార్ పవన్ కళ్యాణ్ .

కొడంగల్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్.

కొడంగల్ మే 03 మన సాక్షి.



కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండల కేంద్రం అంబేద్కర్ చౌరస్తాలో ని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొడంగల్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ నిన్న తెలంగాణ సమాజం మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జ్ఞానోదయం కలిగించారని ఆయన అన్నారు.తెలంగాణ ప్రాంత ప్రజల అస్తిత్వాన్ని , వ్యక్తిత్వాన్ని అవమానపరిచే విధంగా మాట్లాడిన పవన్ కళ్యాణ్ 24 గంటలలో బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 24 గంటలలో క్షమాపణలు చెప్పకపోతే హైదరాబాద్ లో ఉన్న పవన్ కళ్యాణ్ ఇంటికి ముట్టడి చేయడం జరుగుతుందని ఆయన మండిపడ్డారు . ఈ కార్యక్రమంలో కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు మోహన్ నాయక్ ,కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు రాజగోపాల్ రెడ్డి, రెడ్యా నాయక్ , నరేందర్ నాయక్, రాజు నాయక్ ,మహిపాల్, చంద్రప్ప, అమర్నాథ్ రెడ్డి, సొండే మహిపాల్, భీములు, పాండు ముదిరాజ్, సాయిలు, అంజి, నవీన్, కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భూమిని, నీటిని బ్రతకనిద్దాం

## భావితరాలకు బ్రతుకునిద్దాం.

## జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి వై. శేఖర్ రెడ్డి.

కేతేపల్లి జూన్ 03 మనసాక్షి.



భూమిని నీటిని బ్రతకనిద్దాం, భావితరాలకు బ్రతుకునిద్దాం అని నల్గొండ జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి వై. శేఖర్ రెడ్డి అన్నారు. కేతేపల్లి మండలం తుంగతుర్తి, చెరుకుపల్లి,కొండకింది గూడెం, బండపాలెం గ్రామపంచాయతీలలో నిర్వహించిన (జె ఎస్ జె బి ) జల సంచాయి- జన్ భాగిదారి పథకంలో భాగంగా ప్రజలలో నీటిని పొదుపు చేసే విధంగా ప్రజలలో అవేర్నెస్ తీసుకుని వచ్చుటకు నిర్వహించే కార్యక్రమాలలొ ఆయన పాల్గొని మాట్లాడారు. జల సంచాయి- జన్ భాగిదారి కార్యక్రమంలో నీటి నిలువలు ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలి, పర్యావరణాన్ని ఏ విధంగా కాపాడాలి, చెట్లను పెంచి పర్యావరణాన్ని ఏ విధంగా సంరక్షించాలి,పొదుపు సంఘాల మహిళలు డబ్బులు పొదుపు చేసినట్లు ప్రతి కుటుంబ సభ్యులు నీళ్లను తమ యొక్క ఇంటి పరిసరాలలో పొదుపు చెయ్యాలని మరియు ""భూమిని నీటిని బ్రతకనిద్దాం - భావితరాలకు బ్రతుకునిద్దాం" అనే నినాదంతో గ్రామపంచాయతీలలో ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మించాలని పొదుపు చేయాలని, పొలంలో ప పర్యావరణాన్ని కాపాడాలని,భావితరాలకు భవిష్యత్తు అందించాలని చెప్పటం జరిగింది, ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి నాగలక్ష్మి ,ఏపీఓ, ఏపీఎం ఈసీ, ఆయా గ్రామాల సర్పంచులు, కళాసారథి కళాకారులు, పంచాయతీ కార్యదర్శులు, క్లస్టర్ టెక్నికల్ అసిస్టెంట్, ప్లాంటేషన్ సూపర్వైజర్, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సీసీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వివోఏలు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆత్మగౌరవాన్ని, చరిత్రను ప్రతి ఒక్కరు గౌరవించాలి

వెల్దండ జూన్ 03 మన సాక్షి:




ఆంధ్ర పెత్తనం మా మీద వద్దనే లక్ష్యంతో జరిగిన తొలి దశ, మలిదశ తెలంగాణ ఉద్యమాల్లో అనేక మంది తెలంగాణ బిడ్డలు స్వరాష్ట్రం కోసం ఆత్మబలిదానాలు చేశారని నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి కార్యదర్శి బాణావత్ శంకర్ నాయక్ అన్నారు. పుస్తకాలను పక్కనపెట్టి, ఉస్మానియా యూనివర్సిటీని ఉద్యమ వేదికగా చేసుకుని తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడరన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలంగాణ అస్తిత్వాన్ని అర్థం చేసుకున్న నాయకుడని, తెలంగాణ బిడ్డల త్యాగాలను గౌరవిస్తాడని ఇన్నాళ్లు భావించాం కానీ ఇటీవల ఆయన చేసిన వ్యాఖ్యలను బట్టి చూస్తే, తెలంగాణ భావజాలం మరియు ఉద్యమ చరిత్ర పట్ల ఆయనకు సరైన అవగాహన లేదనే భావన కలుగుతోంది. రాజకీయ పరిణతి ఉన్న నాయకుడు తెలంగాణ ప్రజల మనోభావాలను గౌరవించే విధంగా మాట్లాడాలి. అభిమానాన్ని అలుసుగా తీసుకుని తెలంగాణను తక్కువ చేసి మాట్లాడితే ప్రజలు అంగీకరించరని ఆయన హెచ్చరించారు.తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ప్రజల గౌరవం పొందాలంటే ముందుగా తెలంగాణ ఆత్మగౌరవాన్ని, ఉద్యమ చరిత్రను, అమరవీరుల త్యాగాలను గౌరవించాల్సిందేనని శంకర్ నాయక్ పేర్కొన్నారు.

# ఘనంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా మహాసభలు

## భారీగా హాజరైన జర్నలిస్టులు .

## జర్నలిస్టుల తరపున కొట్లాడుతున్న ఏకైక సంఘం టీయూడబ్ల్యూజే (ఐజేయు).

## రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ.

## మరోసారి నల్గొండ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన గార్లపాటి కృష్ణారెడ్డి

నల్లగొండ, జూన్ 3,మన సాక్షి




నల్గొండ జిల్లా నకిరేకల్ పట్టణంలోని వినాయక బ్యాంక్వెట్ హాలులో నల్గొండ జిల్లా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జర్నలిస్టుల జిల్లా మహాసభలు అత్యంత వైభవంగా జరిగాయి.నల్గొండ జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన జర్నలిస్టుల రాకతో పట్టణం సందడిగా మారింది. మహాసభల ప్రారంభానికి ముందు నకిరేకల్ ప్రధాన కేంద్రంలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నుంచి వేదిక వరకు జర్నలిస్టులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో జర్నలిస్టులు నినాదాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. జర్నలిస్టుల సంక్షేమంపై సమీక్ష నిర్వహించి,భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె.రామనారాయణ,రాష్ట్ర కమిటీ నాయకులు ప్రభాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విరహత్ అలీ మాట్లాడుతూ.. "నల్గొండ జిల్లా అంటేనే ఉద్యమాల పురిటిగడ్డ. అలాంటి చైతన్యవంతమైన నకిరేకల్ గడ్డపై జర్నలిస్టుల మహాసభలు నిర్వహించడం గర్వకారణం" అని పేర్కొన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.ప్రస్తుత పరిస్థితుల్లో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన ఇళ్ల స్థలాలు,అక్రిడేషన్ కార్డులు, హెల్త్ కార్డుల పంపిణీలో జరుగుతున్న జాప్యంపై నేతలు క్లుప్తంగా, ఘాటుగా చర్చించారు. ప్రభుత్వం స్పందించి జర్నలిస్టుల సంక్షేమానికి భరోసా కల్పించాలని వారు డిమాండ్ చేశారు.రాష్ట్రంలో బలమైన సంఘంగా చేస్తుందని, రాష్ట్రంలో ఇప్పటివరకు 14వేల సభ్యత్వాలు వచ్చాయని రాష్ట్ర అధ్యక్షులు తెలిపారు. జర్నలిస్టుల సమస్యలపై 24 గంటలు పనిచేస్తున్నామని ఆయన అన్నారు.మహాసభల సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా గార్లపాటి కృష్ణారెడ్డి తిరిగి ఎన్నిక కాగా ప్రధాన కార్యదర్శిగా మహేందర్ రెడ్డి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అలాగే చిన్న పత్రికల సంఘం, ఫోటోగ్రాఫర్లు వీడియో గ్రాఫర్ల సంఘం వివిధ నియోజకవర్గాల నూతన కమిటీలను ఎన్నుకున్నారు కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కె.నాగయ్య,ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, సాంబశివారెడ్డి, నకిరేకల్ నియోజకవర్గ అధ్యక్షులు చెరుకు సతీష్, గౌరవాధ్యక్షులు రేపాల సతీష్, నియోజకవర్గ నాయకులు బయన్న, శీను, కందగట్ల శ్రీధర్, బుడిగ సైదులు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కురుమ మాదాసి సంఘం నాయకులను సన్మానించిన టిఆర్ఎస్



నారాయణపేట టౌన్, జూన్ 03 మనసాక్షి :-

నారాయణపేట జిల్లా కురుమ మాదాసి సంఘం అధ్యక్షుడు సిహెచ్ వెంకటన్న, ప్రధాన కార్యదర్శి గడ్డం తిప్పన్న, ఉట్కూర్ ఆశప్ప, ఉట్కూరు మాదాసి కురువ మాదారి కురువ అధ్యక్షుడు లింగప్ప, మాలే వెంకటేష్ రజక సంఘం శ్రీనివాసులు, కొల్లూరు మల్లప్ప , ఉట్కూరు రాములన్నలను బుధవారం నారాయణపేట జిల్లా తెలంగాణ రక్షణ సేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గవినోళ్ల శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. టిఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యం లో కలిసి ముందుకు పోవాల అని, మదాసి కురుమల హక్కుల కోసం పోరాటం చెయ్యాలనీ సూచించారు.

# సబ్సిడి పై జిలుగు విత్తనాల పంపిణి

చివ్వెంల జూన్ 3 మన సాక్షి



మండల పరిదిలోని ప్రాదమిక వ్యవసాయ సహకార సంఘం అధ్వర్యంలో వ్యవసాయశాఖ తరపున రైతులకు పచిరోట్ట పైరు విత్తనాలు అయినటువంటి జిలుగ విత్తనాలను సబ్సిడిపై పంపిణి చేయడం జరిగినది. మన మండలంకు 60 క్వింటాళ్లు రావడం జరిగినది,30 కేజీ ల పూర్తి ధర 4905/-,ప్రభుత్వ 50% రాయితీ పోను రైతు మిగిలిన 50% నగదు అనగా రూ. 2452. 50/-చెల్లించాలి. జిలుగ విత్తనాలు కావాల్సిన రైతులు తమ యొక్క క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారులకు సంప్రదించాలి అని మండల వ్యవసాయ అధికారి తెలిపారు . పచ్చిరొట్ట జీలుగ పచ్చిరొట్ట పైర్ల ను ఉపయోగించడం వలన అనేక లాభాలు ఉన్నాయి. ఇది భూమికి సేంద్రియ పోషకాలను అందిస్తుంది, నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి పోషకాలను అందిస్తుంది, మరియు దిగుబడులను పెంచుతుంది. అంతేకాకుండా, రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గిస్తుంది.పచ్చిరొట్ట జీలుగను పొలంలో వేసి కలియ దున్నడం వలన భూమి సారవంతం అవుతుంది. ఇది భూమిలో సేంద్రియ పదార్థాలను పెంచుతుంది, దీనివల్ల భూమి సారం పెరుగుతుంది.పచ్చిరొట్ట జీలుగను ఉపయోగించడం వలన దిగుబడులు పెరుగుతాయి. ఇది పంటలకు అవసరమైన పోషకాలను అందిస్తుంది.జీలుగ మొక్కలు నత్రజనిని శోషించుకుంటాయి మరియు వాటి వేర్ల ద్వారా నత్రజనిని నేలకి అందిస్తాయి, ఇది పంటలకు అవసరమైన ఒక ముఖ్యమైన పోషకం. పచ్చిరొట్ట జీ ల ు గ ు న ు ఉపయోగించడం వలన రసాయనిక ఎరువుల వాడకం తగ్గుతుంది.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి.వెంకటేశ్వర్లు,పి.ఎ.సి.ఎస్ సెక్రటరీ జి.శ్రీనివాసు ,వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీశైలం ,శైలజ,పి.ఎ.సి.ఎస్ సిబ్బంది కృష్ణా రెడ్డి, మహేందర్ ,మహేష్, వీరన్న,రామనర్సమ్మ, రైతులు రమేష్ రావు ,శ్రీను, శ్రీనివాసరావు మరియు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ గీత విశ్వనాథ్ ను అభినందించిన టిపిసిసి రాష్ట్ర అధ్యక్షుడు.

నారాయణపేట టౌన్, జూన్ 03 మనసాక్షి :-



సమాజంలో పేదలకు మెరుగైన వైద్య సేవాలు అందించాలి. కాంగ్రెస్ పార్టీ డాక్టర్ సెల్ ను ఏర్పాటు చేయడం అభినంద నీయమని పిసిసి రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. పార్టీ కోసం తమ సమయాన్ని కేటాయించడం డాక్టర్ల నిబద్ధతకు నిదర్శనమని, సమాజంలోని పేద ప్రజలకు వైద్య సేవా లు అందించేందుకు నిష్ణాతులైన వైద్యులను జిల్లాల వారిగా చేర్మెన్ లను నియమించడం గర్వకారణమని పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్ గాంధీభవన్ లొ నిర్వహించిన డాక్టర్ సెల్ సమావేశంలొ అయన మాట్లాడుతు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెత్రుత్వంలో వైద్యం, విద్య, వ్యవసాయ రంగాలకు ప్రభుత్వం ప్రాదాన్యమిస్తుందని, 6లక్షల కోట్ల అప్పులు ఉన్న రాష్ట్ర అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందు కెళ్లుతుందన్నారు. డాక్టర్ సెల్ ఆధ్వర్యంలో తమ తమ జిల్లా లోని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి వైద్యసేవాలు అందించేందుకు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈసందర్బంగా పేట జిల్లా కాంగ్రెస్ డాక్టర్ సెల్ అధ్యక్షురాలు గా నియమితులైన డాక్టర్ గీత విశ్వనాథ్ కు పూల బొకే నందించి అభినందించారు.

# ప్రజారోగ్యమే ధ్యేయం

## అభివృద్ధి పనుల్లో నాణ్యత ముఖ్యం

### మిర్యాలగూడ ఎమ్మెల్యే బీ ఎల్ ఆర్

**మిర్యాలగూడ, జూన్ 03, మన సాక్షి :**







మిర్యాలగూడ పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించడమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.
బుధవారం పబ్లిక్ హెల్త్ విభాగం ఉన్నతాధికారులతో కలిసి ఆయన పట్టణంలో శరవేగంగా జరుగుతున్న చిన్న చెరువు కట్ట ఆధునీకరణ పనులను, మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణ ప్రగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులతో కలిసి ప్రతి పనిని నిశితంగా పరిశీలించి, పలు కీలక సూచనలు చేశారు.
చిన్న చెరువు కట్ట నిర్మాణ పనులను పరిశీలించి, వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని కట్టను మరింత బలంగా నిర్మించాలని ఆదేశించారు.
కట్టపై ప్రజల కోసం వాకింగ్ ట్రాక్, లైటింగ్, పచ్చదనం పెంపొందించే పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు.
నిరుపయోగంగా ఉన్న ఎస్టీపీ ప్లాంట్ సామర్థ్యం, మురుగునీటి శుద్ధి ప్రక్రియ సాంకేతికతను అధికారులను అడిగి తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకూడదని కాంట్రాక్టర్లను, అధికారులను హెచ్చరించారు....
ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లకుండా పబ్లిక్ హెల్త్ అధికారులు నిరంతరం పనులను పర్యవేక్షించాలని సూచించారు. నిర్దేశిత కాలపరిమితిలోగా పనులన్నీ పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనిఅధికారులను ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రెటరీ చిలుకూరి బాలకృష్ణ , కౌన్సిలర్ శ్రీజ,కాంగ్రెస్ నాయకులు బంటు లక్ష్మీ నారాయణ, మేడ మహేందర్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# హరీష్ రావుకు శుభాకాంక్షలు

**జహీరాబాద్,జూన్ 03, మనసాక్షి**



మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావుకు తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై. నరోత్తమ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం హైదరాబాద్లోని హరీష్ రావు నివాసానికి వెళ్లి పుష్పగుచ్చాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు ఇలాంటి జన్మదినాలు మరిన్ని చేసుకోవాలని ఆయన కోరారు. నరోత్తం వెంట బీఆర్ఎస్ నాయకులు షికారి గోపాల్, భాస్కర్, పవన్ రాథోడ్ తదితరులు ఉన్నారు.

# మమతీ కోటకు బీటలు !

కాంగ్రెస్‌లో ఉండగా ఫైర్‌బ్రాండ్ పేరు తెచ్చుకుని ప్రజలకు చేరువయ్యేలా ఎత్తులు, జిత్తుల వేసిన మమతా బెనర్జీ ఇప్పుడు దాదాపుగా ఒంటరిగా మారక తప్పడం లేదు. దాదాపు పదిహేనేళ్లు పశ్చిమబెంగాల్‌ను ఏకఛత్రాధిపత్యంగా పాలించిన దీదీ నిరంకుశ పాలనకు తెరతీశారు. బెంగాల్లో అధికారమే లక్ష్యంగా ఆమె చేసిన పనులు దేశ ఐక్యతను దెబ్బతీసే స్థితికి చేరాయి. లక్షల్లో బంగ్లా దేశీయుల చొరబాట్లను ప్రోత్సహించి, ఎన్నికల్లో విజయం సాధిస్తూ వచ్చినా.. పాపం పండింది. ఇప్పుడు ఎక్కడ చూసినా బంగ్లా జీతాయులు బెంగాల్‌ను వీడిపోతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. సువేందు అధికారి పగ్గాలు చేపట్టగానే తొలుత బంగ్లాదేశాయులను తరిమివేసే కార్యక్రమం చేపట్టారు. దీంతో ఇప్పుడు సరిహద్దుల్లో వారు వేలాదిగా గుమికూడి భారత్‌ను వీడే దృశ్యాలు కనిపిస్తున్నాయి. అధికారంలో ఉండగా నిరంకుశంగా వ్యవహరించారు. ఓ స్త్రీ అధికారంలో ఉంటే ఎంతగానో అభివృద్ధి చెందాలసిన బెంగాల్ అరాచక పాలనకు కేంద్రబిందువుగా మారింది. అత్యాచారాలు, దోపిడీలు, దొంగతనాలు రాజ్యమేలాయి. ఇవన్నీ ఇప్పుడు శాపంగా మారి మమతను వెంటాడుతున్నాయి. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తృణమూల్ కాంగ్రెస్‌లో చిచ్చు రేపుతోంది. ఫలితాలు వెలువడి నెల రోజులైనా కాకముందే.. అంతర్గత విభేదాలతో పార్టీ సతమత మవుతోంది. అధినాయకురాలు మమతా బెనర్జీకి పార్టీపై ఉన్న పట్టు సడలుతున్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 50 మంది తృణమూల్ ఎమ్మెల్యేలు రహస్య సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవడం.. మంగళవారం స్వయంగా దీదీ నిర్వహించిన ధర్నాకు ఆరుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలే హాజరు కావడం దీనికి బలాన్ని చేకూరుస్తోంది. దాదాపు మూడు దశాబ్దాల క్రితం అవతరించినప్పటి నుంచీ.. తృణమూల్‌లో తలెత్తిన అతిపెద్ద సంక్షోభంగా దీనిని చెప్పవచ్చు. బెంగాల్‌లో ఇటీవలి ఎన్నికల్లో తృణమూల్ తరపున 80 మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. లోక్‌సభ, రాజ్యసభల్లో కలిపి పార్టీకి 40 మందికి పైగా ఎంపీలు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత తొలిసారిగా మమత కోల్‌కతాలో భాజపా ప్రభుత్వానికి వ్యతిరేకంగా మంగళవారం చేపట్టిన నిరసనకు ఆరుగురు ఎమ్యెల్యేలు, ముగ్గురు ఎంపీలే హాజరవటం అందరినీ ఆశ్చర్యపరిచింది. వీరిలో డెరెక్ ఓబ్రియెన్, కల్యాణ్ బెనర్జీ, శోభన్‌దేబ్ చటోపాధ్యాయ, నైనా బందోపాధ్యాయ వంటి సీనియర్ నేతలే ఉన్నారు. కొత్తగా పార్టీ తరపున ఎన్నికైనవారెవరూ నిరసనకు హాజరవలేదు. మమత అధ్యక్షతన ఇటీవల తృణమూల్ ఎమ్మెల్యేల సమావేశాన్ని ఏర్పాటు చేయగా.. 20 మందే వచ్చారు. దీంతో ఆ సమావేశాన్ని రద్దు చేయాల్సి వచ్చింది. తృణమూల్ తమ శాసనసభా పక్ష నేతగా శోభన్‌దేబ్ ఛటోపాధ్యాయ్‌ని నియమించింది. అయితే ఆ నియామక ఉత్తర్వుల్లో తమ సంతకాలను ఫోర్జరీ చేశారంటూ పార్టీ ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీ, సందీపన్ సాహా స్పీకరుకు ఫిర్యాదు చేయడం కలకలం సృష్టించింది. ఈ పరిణామంతో రితబ్రత, సందీపన్‌లను తృణమూల్ సస్పెండ్ చేసింది. పార్టీలో తిరుగుబాటు వర్గానికి రితబ్రత నాయకత్వం వహిస్తున్నారు. చీలిక వర్గానికి మెజార్టీ ఉందని అతను ప్రకటించడం మమతా బెనర్జీకి మింగుడుపడని వ్యహారంగా చూడాలి. తృణమూల్ ఎమ్మెల్యేల్లోని ఓ వర్గం తమ శాసనసభా పక్ష నేతగా రితబ్రతను నియమించాలని కోరుకుం టున్నట్లు సమాచారం. పార్టీని చీల్చి, గుర్తును కూడా సొంతం చేసుకునేందుకు దాదాపు 50 మంది ఎమ్యెల్యేలు యత్నిస్తున్నట్లు స్వయంగా తృణమూల్ అధికార ప్రతినిధి రిజుదత్తా పేర్కొన్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టం నిబంధనల ప్రకారం.. అనర్హత వేటు పడకుండా ఉండేందుకు చీలిక వర్గానికి మూడింట రెండొంతుల శాసనసభ్యుల మద్దతు అవసరం. అంటే తృణమూల్ తిరుగుబాటు వర్గంలో 53 మంది ఎమ్మెల్యేలు ఉండాలి. ఆ బలం కూడగట్టుకునే ప్రయత్నాల్లో భాగంగానే దాదాపు 50 మంది ఎమ్మెల్యేలు సోమవారం రహస్యంగా సమావేశమయ్యారని సమాచారం. స్వయంగా మమత, ఆమె సన్నిహితుడు కునాల్ ఘోష్ కూడా తృణమూల్‌లో విభేదాలు ఉన్నాయని అంగీకరించారు. పార్టీ నాయకత్వానికి తెలియకుండా రహస్య సమావేశాన్ని ఏర్పాటుచేసి పార్టీలో చీలిక తెచ్చేందుకు రితబ్రత ప్రయత్నిస్తున్నట్లు కునాల్ ఆరోపించారు. వీటిని రితబ్రత ఖండించారు. అయితే టీఎంసీ కనుమరుగయ్యే అవకాశం ఉందని, అది ఇకపై మనుగడ సాధించలేదని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత 100 మంది కౌన్సిలర్లు తృణమూల్‌ను వీడారు. ఇప్పటికే పలువురు నేతలు కూడా టీఎంసీ నాయకత్వంపై ముఖ్యంగా మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ వరుస పరిణామాలు టీఎంసీకి పొంచిఉన్న సంక్షోభానికి సంకేతాలుగా కనిపిస్తున్నాయి. తృణమూల్ రెండుగా చీలనుందని, మహారాష్ట్ర పరిస్థితులే బెంగాల్‌లోనూ రానున్నాయని మంత్రి తపస్ రాయ్ వ్యాఖ్యానించారు.
ఎన్నికల్లో భాజపా గెలుపు అనంతరం తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై జరుగుతోన్న దాడులకు వ్యతిరేకంగా తృణమూల్ కాంగ్రెస్ అధినేత, మాజీ సీఎం మమతా బెనర్జీ ధర్నా చేపట్టారు. భాజపాకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడుతానని ఆమె శపథం చేశారు. దేశవ్యాప్తంగా భాజపాకు వ్యతిరేకంగా పోరాడుతున్న పార్టీలు దిల్లీలో సమావేశమవుతాయి. ఎన్ని బెదిరింపులు వచ్చినా నిరసన కొనసాగుతుందని మమత స్పష్టంచేశారు. అయితే అధజకారంలో ఉండగా అత్తా అల్లుళ్ల ఆగడాలను నేతలతో పాటు ప్రజలు కూడా సమించారు. కానీ పరిస్తితి మారింది. ఇప్పుడు బిజెపి ప్రభుత్వం ఏర్పడడంతో వీరంతా తిరుగుబాటు జెండా ఎగరువేశారు. ఏ జెండాకు ఆగొడుగు పట్టి, నానా యాగీ చేయడం మమతా బెనర్జీ నైజం. మొన్నటి ఎన్నికల్లో అలాగే చేయబోయారు. కానీ బిజెపి పన్నిన ఉచ్చులో పడ్డ మమత గిలగిల కొట్టుకోవడం మినహా చేయగ లింది లేదు. మమతను ప్రజలే ఛీత్కరించుకునే స్థాయికి వచ్చింది.

# వాచ్ స్ట్రాప్స్ తో స్కిన్ అలర్జీ డా. సాయి సింధు

**శంకర్‌పల్లి: జూన్ 03: (మన సాక్షి):**



మనం రోజూ పెట్టుకునే వాచ్ లోని (స్ట్రాప్స్, బెల్ట్ బకిల్స్ లో ఉండే 'నికెల్' వల్ల స్కిన్ అలర్జీ వస్తుందని స్కిన్ డా. సాయి సింధు హెచ్చరించారు. ఈ సందర్భంగా బుధవారం డా. సాయి సింధు మాట్లాడుతూ ఈ అలర్జీ వెంటనే రాదని, నెలల తరబడి వాడటం వల్ల ఆలస్యంగా దద్దుర్లు వస్తాయని చెప్పారు. 'ఒకసారి ఇది వస్తే పోదని, సిలికాన్ స్ట్రాప్స్ లేదా నికెల్ లేని లోహాలు వాడితే చర్మం దానంతట అదే కోలుకుంటుందని సూచించారు. మీకూ వాచ్ వల్ల అలర్జీ వచ్చిందా? అయితే వెంటనే శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ఏడవ వార్డు రామంతపురం శివారులో గల "సాన్స్ స్కిన్ అండ్ హెయిర్ ట్రాన్స్ ప్లాంటేషన్" హాస్పిటల్ వారిని సంప్రదించాలని డాక్టర్ కోరారు. అపాయింట్మెంట్ కొరకు ఈ నెంబర్ (8337000777) కు కాల్ చేయగలరని డా. సాయి సింధు పేర్కొన్నారు.

# ఇంటి నిర్మాణ కోసం ఆర్థిక సహాయం



తెలంగాణ ఫుడ్ కమిషన్ చైర్మన్ అందజేత

**వెల్దండ జూన్ 03 (మన సాక్షి ):**

వెల్దండ మండల పరిధిలోని అంకమోనికుంట గ్రామానికి చెందిన మొకరాల వెంకయ్య ఇంటి నిర్మాణం కోసం తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి రూ. 25 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..గోలి శ్రీనివాస్ రెడ్డి ఆర్థిక ఇబ్బందులతో ఇల్లు నిర్మించుకోలేకపోతున్న నిరుపేద కుటుంబాలకు తమ వంతు సహాయ సహకారాలు అందించడం సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. మొకురాల వెంకయ్య కుటుంబ సభ్యులు ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక సహాయం అందజేసిన తెలంగాణ ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ ఎల్లప్పుడు రుణపడి ఉంటామన్నారు .ఈ కార్యక్రమంలో వెల్దండ మండల మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్ శ్రీనివాస్ రెడ్డి పుట్ట.రాజేష్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి అక్కడికక్కడే మృతి

**చింతపల్లి. జూన్ 3 మన సాక్షి.**



హైదరాబాద్ నాగార్జునసాగర్ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చింతపల్లి మండలంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది తెలిసినవారు ప్రకారం చింతపల్లి మండల కేంద్రానికి చెందిన కొంగల రాము 36 సంవత్సరాల వయసు కలిగి ఉన్నాడు. రోజువారి కూలి గా మేస్త్రిగా పనిచేస్తూ బుధవారం రంగారెడ్డి జిల్లా మాడుగుల మండల కేంద్రంలో పని పూర్తి చేసుకుని తిరిగి తన మోటార్ బైక్ పై చింతపల్లి మండల కేంద్రానికి వెళ్తున్న సందర్భంగా మండల పరిధిలోని విరాట్ నగర్ గ్రామ సమీపంలో మల్లేపల్లి నుండి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం మోటార్ బైకును బలంగా ఢీ కొట్టి వ్యక్తిపై ఆ వాహనం వెళ్లడంతో కొంగల రాము అక్కడికక్కడే మృతి చెందాడు ప్రమాద సంఘటన విషయం తెలుసుకున్న విరాట్ నగర్ కాలనీవాసులు వెంటనే చింతపల్లి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరిస్తున్నారు. మృతునికి భార్య ముగ్గురు పిల్లలు కలిగి ఉన్నట్లు సమాచారం. మృతుని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# పాలేటి గంగమ్మ తల్లి అనుగ్రహంతో జగన్మోహన్ రెడ్డి మళ్ళీ సిఎం కావాలి

## మదనపల్లె వైస్సార్సీపీ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్



**రామసముద్రం జూన్ 3 మనసాక్షి**

అన్నమయ్య జిల్లా మదనపల్లె నియోజకవర్గం మదనపల్లె మండలం చిప్పిలి జరుగుతున్న పాలేటి గంగమ్మ తల్లి జాతర సందర్భంగా మదనపల్లె వైస్సార్సీపీ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలలో పాల్గొన్నారు. చిప్పిలి గ్రామస్థులు, స్దానిక వైస్సార్సీపీ నాయకులు ఘన స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసినారు. నిస్సార్ అహమ్మద్ మాట్లాడుతూ పాలేటి గంగమ్మ తల్లి అనుగ్రహం ఆశీస్సులతో జగన్మోహన్ రెడ్డి మళ్ళీ సిఎం కావాలని, ప్రజా ప్రభుత్వం వచ్చి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి, మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంటు సభ్యులు మిధున్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులకు పాలేటి గంగమ్మ తల్లి దివ్య ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుతున్నట్లు నిస్సార్ అహమ్మద్ తెలిపారు. పాలేటి గంగమ్మ తల్లి అనుగ్రహంతో సకాలంలో వర్షాలు కురిసి, పంటలు సంవృద్ధిగా పండి రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. పూజ కార్యక్రమాల అనంతరం కురవంక మాజీ సర్పంచ్ పసుపులేటి చలపతి, చిప్పిలి మల్లికార్జున రెడ్డి ఆత్మీయ ఆహ్వానం మేరకు స్వగృహాలకు వెళ్ళి వారి ఆతిధ్యం స్వీకరించారు. నిస్సార్ అహమ్మద్ తోపాటు వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ ప్రవీణ్



**శంకర్‌పల్లి: జూన్ 03: (మన సాక్షి):**

శంకర్‌పల్లి మున్సిపాలిటీని అన్ని విధాల అభివృద్ధి చేయడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని రెండవ వార్డు గాయత్రీ నగర్ కాలనీలో రోడ్డు, పార్కు అభివృద్ధి పనులను స్థానిక కౌన్సిలర్ సంధ్యారాణి అశోక్ కుమార్, కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి ప్రారంభించారు. అనంతరం కాలనీకి చెందిన ఉపాధ్యాయుడు బాలాజీ ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ తరపున ఫిన్లాండ్ కు వెళ్లిన నేపథ్యంలో ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ శ్వేతా పాండురంగారెడ్డి, కౌన్సిలర్ లు గిరిజ చంద్రశేఖర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

# చీలిక దిశగా తృణమూల్ కాంగ్రెస్

కోల్‌కతా: అంతర్గత విభేదాలతో టీఎంసీ పార్టీ సతమతమవుతోన్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. తనకు 59 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని తృణమూల్ కాంగ్రెస్ నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ పేర్కొన్నారు. అసెంబ్లీలో పార్టీకి మొత్తం 80 మంది శాసనసభ్యులు ఉండగా.. వారిలో మూడింట రెండొంతుల కంటే ఎక్కువమంది మద్దతు తమకు ఉందని పేర్కొంటూ స్పీకర్‌కు లేఖ సమర్పించారు. టీఎంసీ తిరుగుబాటు వర్గం ఆయనను కొత్త ప్రతిపక్ష నేతగా ప్రతిపాదిస్తు న్నట్లు తెలుస్తోంది. టీఎంసీ పార్టీని చీల్చి, గుర్తును కూడా సొంతం చేసుకునేందుకు దాదాపు 50 మందికి పైగా ఎమ్యెల్యేలు ప్రయత్నిస్తున్నట్లు స్వయంగా తృణమూల్ అధికార ప్రతినిధి రిజుదత్తా పేర్కొన్న అనంతరం ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. ఫిరాయింపుల నిరోధక చట్టం నిబంధనల ప్రకారం.. అనర్హత వేటు పడకుండా ఉండేందుకు చీలిక వర్గానికి మూడింట రెండొంతుల శాసనసభ్యుల మద్దతు అవసరం. అంటే తృణమూల్ తిరుగుబాటు వర్గంలో 53 మంది ఎమ్మెల్యేలు ఉండాలి. ప్రస్తుతం రెబల్ వర్గానికి అంతకంటే ఎక్కువ (59) మద్దతు ఉండడంతో వారు టీఎంసీ పేరు, చిహ్నాన్ని సొంతం చేసుకునే అవకాశం ఉంది. తృణమూల్ తమ శాసనసభా పక్ష నేతగా ఇటీవల శోభన్‌దేబ్ ఛటోపాధ్యాయ్‌ని నియమించింది. అయితే ఆ నియామక ఉత్తర్వుల్లో తమ సంతకాలను ఫోర్జరీ చేశారంటూ పార్టీ ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీ, సందీపన్ సాహా స్పీకర్‌కు ఫిర్యాదు చేయడం కలకలం సృష్టించింది. ఈ పరిణామంతో రితబ్రత, సందీపన్‌లను సోమవారం తృణమూల్ సస్పెండ్ చేసింది. నాటి నుంచి పార్టీలో తిరుగుబాటు వర్గానికి రితబ్రత నాయకత్వం వహిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు టీఎంసీలో కొనసాగుతోన్న గందరగోళం నేపథ్యంలో ఆ పార్టీకి చెందిన 15 మంది ఎంపీలు తనను సంప్రదించారని బెంగాల్ భాజపా నేత దిబ్యేందు అధికారి ప్రకటించారు. అయితే ప్రస్తుతానికి ఎవరినీ పార్టీలోకి తీసుకోకూడదని భాజపా అధిష్ఠానం నుంచి ఆదేశాలు అందాయని తెలిపారు. ఈ విషయంపై పార్టీ అధినేత మాత్రమే నిర్ణయం తీసుకుంటారన్నారు. టీఎంసీ పార్టీలో సంక్షోభం మరింత తీవ్రమయ్యే రోజు దగ్గరలోనే ఉందని.. మమతా బెనర్జీ నేతృత్వంలోని పార్టీ పతనం వైపు పయనిస్తోందని అన్నారు.

Edited, Printed, Published and Owned by MALLE NAGI REDDY Printed at LAXMI PUBLICATIONS H.No. 28-891/9, Journalist Colony, Chinthapally X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana.and Published at H.no.. 28 - 891/9, Chinthapally Bypass X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana."Editor: MALLE NAGI REDDY. RNI NO. TELTEL/2022/83470. Cell: 9666924232. gmail Id: manasakshi.in@gmail.com.